సహజీవన భావనల పావురాయి

# గీటురాయి

వారపత్రిక 14-1-2022 ₹ 15/-



## ఆన్‌లైన్ చీకటిలో వేలంపాటల అపస్వరాలు



## చరిత్ర సృష్టించిన షాహీన్ బాగ్

సమాజీవన భావనల పావురాయి
# గీటురాయి
వారపత్రిక

## GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in

సంపుటి 44 సంచిక : 2 హైదరాబాద్
శుక్రవారం 14 జనవరి 2022 రూ.15-00
10 జమాదివుల్ ఆఖిర్ 1443 హిజ్రీ

**తొలిగీటు**

“ఒకరికొకరు కానుకలు అందజేసుకోండి. దానివల్ల పరస్పరం అనురాగం పెరుగుతుంది. హృదయాల్లో ఏర్పడిన మాలిన్యం దూరమవుతుంది”

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

**సేల్స్ మేనేజర్**
**ముహమ్మద్ యాసీన్, 9700255736**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at “Geeturai Graphics”, Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




24

## లోపల...


| | | |
|---|---|---|
| ప్రకటనల రాజకీయం | ...... | 04 |
| ఆన్‌లైన్ చీకటిలో వేలంపాటల అపస్వరాలు | ...... | 05 |
| చరితార్థులు–అల్లామా సయ్యద్ అబ్దుల్ కరీం గని | ...... | 08 |
| యుద్ధం ఇతర మతాలలో – 15 | ...... | 09 |
| ఏమిటీ ఘోరం? | ...... | 12 |
| చరిత్ర సృష్టించిన షాహీన్‌బాగ్ | ...... | 14 |
| అన్యాయానికి గురైన వారికి సహాయపడండి | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| ఇస్లామీయ సందేశం–విశ్వజనీన కేంద్రం–కాబా :6 | ...... | 20 |
| ఆలోచన... అంకురం... ఆనందం... | ...... | 22 |
| హరిద్వార్‌లో విద్వేష ప్రసంగాలు | ...... | 26 |
| బడుగుల జీవితాల్లో వెలుగులు నింపిన విద్యా జ్యోతి | ...... | 29 |
| గృహిణి బాధ్యతలు ఇంతింత కాదయా... | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |


### వై. ఎస్ . ఆర్ ‘ఏ పీ’...



జగనన్నకు పోటీగా
వై.ఎస్.ఆర్ టీపీ
జనం నాడి ఏమిటో
లాగుతోందట కూపీ!
అన్నా చెల్లెలు మధ్య
లేదనుకునేరు హ్యాపీ
వాళ్ళువాళ్ళు ఒకటేలే
మనకెందుకండి బీపీ!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

## ఆలోచన

# ప్రకటనల రాజకీయం

**ఎన్నికలు** వచ్చినప్పుడు రాజకీయ పార్టీలు ప్రకటనలు ఇవ్వడం మామూలే. ఈ ప్రకటనల వల్ల నిజంగా ఆ పార్టీకి లాభం ఉంటుందా? ప్రజలు ప్రకటనలను నమ్మి ఓట్లు వేస్తారా? ఈ ప్రశ్నలకు ఇదమిత్థంగా జవాబు చెప్పడం కష్టం. కాని ప్రజలను ఆకట్టుకోడానికి ప్రకటనివ్వడం అనేది ఇప్పుడు సర్వసాధారణం.

ప్రజలను ఆకట్టుకోడానికి, తాము చేసిన పనులు చెప్పుకోడానికి సాధారణంగా ఈ ప్రకటనలు ఉపయోగపడతాయి. కాని మరో ఉద్దేశ్యంతో ముందుకు వచ్చే ప్రకటనలు కూడా ఉన్నాయి. అదేమిటంటే, ఒక అయోమయాన్ని సృష్టించడం, ప్రతిచర్యను రెచ్చగొట్టడం. ఓట్లను రాబట్టడం ఈ ప్రకటనల ముఖ్య ఉద్దేశ్యం కాదు. అయోమయం, ప్రతిచర్యల ద్వారా పరిస్థితిని తమకు అనుకూలంగా మలచుకునే ఎత్తుగడ వీటి వెనుక ఉంటుంది.

ఉత్తరప్రదేశ్‌లో ఇప్పుడు అదే జరుగుతోంది. యోగీ సారథ్యంలోని బీజేపీ పార్టీ సాధించిన విజయాలను చెప్పుకునే ప్రకటనల్లో అబద్ధాలు, బయటి ప్రాంతాల ఫోటోలను కూడా తమ రాష్ట్రానికి సంబంధించిన ఫోటోలుగా వాడుకున్న హాస్యాస్పద సంఘటనల తర్వాత ఇప్పుడు ఈ కొత్త ఎత్తుగడ మొదలయ్యింది. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో ఇప్పుడు మతం, కులం, ధనబలం ఇవే కీలకంగా మారాయి. ఒక దినపత్రిక ప్రకటనలో తలపై టోపీ పెట్టుకుని ముస్లిములా కనిపిస్తున్న వ్యక్తిని అల్లర్లు చేస్తున్న వ్యక్తిగా చూపించి యోగి హయాంలో అల్లర్లు లేవని చెప్పుకోవడం. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఎవరు నిరసనలు చేస్తున్నారో వారిని దుస్తుల ద్వారా గుర్తించవచ్చని మోడీ చెప్పిన మాటలు కూడా ఇక్కడ గుర్తుకు తెచ్చుకోవాలి.

ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో హిందూ ముస్లిముల మధ్య చిచ్చుపెడితే, హిందూ ఓట్లు బీజేపీకి పోలయ్యేలా చేసుకుంటే చాలు గెలుపు తథ్యం అనేది బీజేపీ ఎత్తుగడ. ఈసారి ఎన్నికల్లో ముస్లిములు సమాజ్‌వాది పార్టీకి ఓటు వేసేలా కనిపిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో దాదాపు 143 నియోజక వర్గాల్లో ముస్లిములు బలంగా ఉన్నారు. 2007లో ముస్లిములు బహుజన సమాజ్ పార్టీకి వేశారు. 2012లో సమాజ్‌వాది పార్టీకి వేశారు. 2017లో ముస్లిం ఓట్లు సమాజ్‌వాది, బహుజనసమాజ్ మధ్య చీలిపోయాయి. ఫలితం బీజేపీ గెలిచింది.

ఈసారి బీజేపీకి, సమాజవాదికి మధ్య ప్రధానంగా పోటీ ఉంటుంది. బహుజనసమాజ్ పార్టీ ఇప్పుడు ఉనికిలో లేనట్లే. ఉత్తరప్రదేశ్‌లో మజ్లిస్ పార్టీ కూడా పోటీ చేస్తోంది. కాని మజ్లిస్, పీస్ పార్టీలకు నామమాత్రపు ఉనికి కూడా లేదు. ముస్లిములకు రాజకీయాధికారం సాధిస్తానని చెబుతున్న అసదుద్దీన్ ఒవైసీ మాటలు యువతను ఆకట్టుకుంటున్నాయన్నది నిజమే. కాని ఆయన వల్ల బీజేపికి లాభం కలుగుతుందన్న విశ్లేషణలు కూడా ఉన్నాయి.

దాదాపు 30 స్థానాల్లో ముస్లిముల ఓట్లు చీలకుండా ఉంటే కోరిన వారిని ముస్లిములు స్వంత బలంతో గెలిపించగలరు. 9 స్థానాల్లో ముస్లిముల జనాభా 55 శాతం ఉంది. దాదాపు 28 జిల్లాల్లో ముస్లిములు 20 శాతం వరకు ఉన్నారు. మిగిలిన జిల్లాల్లో కూడా 10 నుంచి 15 శాతం ఉంటారు.

ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో బీజేపీ గెలవాలంటే ఇంతకు ముందు ముస్లిముల ఓట్లను చీలిస్తే సరిపోయేది. కాని ఇప్పుడు పరిస్థితి మారింది. ఈ సారి హిందూ ఓట్లు బీజేపికే పూర్తిగా దక్కుతాయన్న గ్యారంటీ కనిపించడం లేదు. వ్యవసాయ చట్టాలపై పశ్చిమ ఉత్తరప్రదేశ్ రైతాంగం ఉద్యమించిన తర్వాత పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి.

అందుకే హిందువులను సమాజ్‌వాది పార్టీకి వ్యతిరేకంగా రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అఖిలేష్ యాదవ్ ఎంత ప్రయత్నించినా రామజన్మభూమి మందిర నిర్మాణాన్ని అడ్డుకోలేరని ఒక సందర్భంలో బీజేపీ అగ్రనేతలు చెప్పారు. రామమందిర నిర్మాణం అడ్డుకుంటానని అఖిలేష్ యాదవ్ ఎప్పుడైనా చెప్పాడా? లేనే లేదు. కాని అతను చెప్పినట్లు ప్రజలను నమ్మించే కుతంత్రాల రాజకీయాలివి. వీటిని ఓటర్లు ఇప్పుడు గుర్తిస్తున్నారు. ఉత్తరప్రదేశ్ ఓటర్ల తీర్పు ఎలా ఉంటుందో ఎన్నికల తర్వాత మాత్రమే తెలుస్తుంది.

అబ్దుల్ వాహెద్



# ఆన్‌లైన్ చీకటిలో వేలంపాటల అపస్వరాలు

**కొత్త సంవత్సరం** మొదటి రోజు అందరూ నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకుంటూ ఆనందంగా గడిపారు. కాని కొందరు ముస్లిం మహిళలను ఈ నూతన సంవత్సరం మొదటి రోజు అత్యంత అసహ్యకరమైన విద్వేషాగ్ని మంటలతో స్వాగతం పలికింది. వారి ఫోటోలు సోషల్ మీడియా వేదికపై ప్రత్యక్షమయ్యాయి. అత్యంత అసహ్యకరంగా వారిని వేలం వేస్తున్న పోస్టులవి.

ఇది మొదటిసారి కాదు, ఇంతకు ముందు కూడా ఇలా జరిగింది. ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి ఊరుకున్నారు. ఒక్క అరెస్టు కూడా జరగలేదు. నిజంగా ఢిల్లీ పోలీసులకు ఈ విద్వేషాగ్ని రాజేస్తున్న దుర్మార్గపు నేరస్తుల గురించి ఆచూకీ తెలియలేదా? కాని ఈసారి ముంబయి పోలీసులు మాత్రం ఆచూకీ పసిగట్టారు. అరెస్టులు చేశారు. ఈ అరెస్టులు జరిగిన తర్వాత ఢిల్లీ మహిళా సంఘం సుమోటోగా ఈ కేసును స్వీకరించి ఢిల్లీ పోలీసు అధికారుల నుంచి వారి దర్యాప్తు వివరాలు కోరింది. ఢిల్లీ పోలీసులు ఆచూకీ లేని ఆగంతకులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు. అంతకు మించి ఆ కేసులో ప్రగతి లేదు.

జనవరి 1వ తేదీన ఆన్‌లైన్ సామాజిక మాధ్యమం గిట్‌హబ్‌లో దాదాపు వంద మంది ప్రముఖ ముస్లిం మహిళల ఫోటోలు ప్రత్యక్షమయ్యాయి. ఈ మహిళలందరూ సమాజంలో తమ తమ రంగాల్లో పేరుప్రతిష్ఠలు గడించినవారు. జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు ఉన్నారు. కమర్షియల్ పైలట్‌గా పని చేస్తున్న మహిళ ఫోటో కూడా ఇందులో ప్రత్యక్షమయ్యింది.

ఇంతకు ముందు జులై 2020లో కూడా ఇలాంటి సంఘటనే

జరిగింది. అప్పుడు కూడా గిట్ హబ్ వేదికగా ముస్లిం మహిళల వేలంపాట పోస్టు చేశారు. రెండు సందర్భాల్లోను ముస్లిం మహిళలను కించపరిచే అత్యంత హీనమైన పదాలతో ఈ ఆన్‌లైన్ వేదికల యాప్‌కు పేరు పెట్టారు. జులైలో ఈ సంఘటన జరిగినప్పుడు బాధిత ముస్లిం మహిళలు ఫిర్యాదుల తర్వాత కేసు నమోదయ్యింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తిన తర్వాత గిట్ హబ్ ఈ యాప్‌ను తొలగించింది. కాని నేరస్తులను పట్టుకోవడం కాని, శిక్షించడం కాని ఏమీ జరగలేదు. ఫలితంగా ఈ నేరస్తులకు మరింత ధైర్యం వచ్చింది. నూతన సంవత్సరం ప్రారంభం రోజునే ఈ దుర్మార్గానికి మరోసారి పాల్పడ్డారు.

ఈసారి కూడా పౌరసమాజం, సామాజిక కార్యకర్తలు ఈ విద్వేషాన్ని తీవ్రంగా ఖండించారు. విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతిపక్ష నేతలు తీవ్రస్వరంతో ఈ పరిస్థితిని ఖండించారు. దుర్మార్గపు మతతత్వ దురహంకారమే దీని వెనుక ఉందని పలువురు విమర్శించారు.

గిట్ హబ్ మరోసారి ఈ కొత్త యాప్ ను కూడా తొలగించింది. ఈసారి ముంబయి పోలీసులు కేసు విచారణలో కాస్త పురోగతి చూపించారు. బెంగుళూరు నుంచి 21 సంవత్సరాల ఇంజనీరింగ్ విద్యార్థి విశాల్ కుమార్‌ను అరెస్టు చేశారు. ఉత్తరాఖండ్‌కు చెందిన 18 సంవత్సరాల శ్వేతా సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. జులై లోను, జనవరిలోను జరిగిన ఈ రెండు సంఘటనలు స్పష్టంగా ముస్లిమ్ మహిళలను లక్ష్యంగా చేసుకుని వేధించడానికి ఉద్దేశించినవన్నది తెలుస్తున్నది. కాని గిట్ హబ్ నడుపుతున్న మైక్రోసాఫ్ట్ ఈ విషయంలో ఇంతవరకు నోరు విప్పలేదు. ఈ యాప్ వివరాలు ప్రచారంలోకి వచ్చిన ట్విట్టరు కూడా నోరిప్పలేదు. ఈ టెక్ కంపెనీలు తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నాయి.

ఈ మొత్తం వ్యవహారాన్ని పరిశీలిస్తే టెక్ కంపెనీల అమానుష ధోరణి కూడా తెలిసి వస్తుంది. సామాజిక మాధ్యమాల్లో ఈ విద్వేషాగ్నిని ఈ కంపెనీలు చూసి చూడనట్లు వదిలేస్తున్నాయన్నది స్పష్టంగా తెలుస్తున్న విషయం. విద్వేషం మరింత విద్వేషానికి జన్మనిస్తుంది.

ఒక సంఘటన ముందుకు వచ్చినప్పుడు కాస్త సమయం గడిచే వరకు తమాషా చూసి ఆ తర్వాత ఆ యాప్‌ను తొలగించడం వంటి రియాక్షనరీ చర్యలు తీసుకుని ఈ టెక్ కంపెనీలు చేతులు దులుపుకుంటున్నాయి. వివిధ సముదాయాలపై అత్యంత హీనంగా తమ వేదికలపై దాడులు జరగకుండా ముందస్తు చర్యలు ఈ కంపెనీలు తీసుకోలేవా? అలాంటి అల్గారిథమ్ తయారు చేయడం ఈ కంపెనీలకు కష్టమా? ఎవరు ఈ దుర్మార్గానికి పాల్పడ్డారో కనిపెట్టడం ఈ కంపెనీలకు కష్టమా? ఈ దుర్మార్గపు యాప్‌లు హ్యూమన్ ట్రాఫికింగ్ వంటి నేరాన్ని సూచిస్తున్నాయన్నది ఈ కంపెనీలకు తెలియదా? షబానా ఆజ్మీ, మలాలా యూసుఫ్ జాయ్ వంటి ప్రముఖ మహిళలనే కాదు, జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి మాయమైన విద్యార్థి నజీబ్ అహ్మద్ తల్లి ఫాతిమా నఫీస్‌ను కూడా ఈ దుర్మార్గులు తమ యాప్‌లో వేలానికి పెట్టారు. గిట్ హబ్‌లో ఇదంతా జరుగుతున్నప్పుడు ఆ కంపెనీ ముందుగా ఇదంతా కనిపెట్టలేక పోయిందా? పౌరసత్వ సవరణ చట్టంపై నిరసనలో పాల్గొన్న జెఎన్యూ విద్యార్థినులు ఆయెషా రీనా, లదీదా ఫర్జానా, నిదా పర్వీన్‌లను కూడా లక్ష్యంగా చేసుకున్నారు. ఈ కేసును సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. వారే కాదు అనేకమంది ఈ డిమాండ్ చేస్తున్నారు.

హరిద్వార్‌లో ముస్లిములపై విద్వేషం వెళ్ళగక్కే ప్రసంగాలు జరిగాయి. సామాజిక వేదికలపై ముస్లిములను కించపరిచే అసహ్యకరమైన ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇవన్నీ ఒకే భావజాలం కారణంగా సమాజంలో చోటు చేసుకుంటున్నాయన్నది రహస్యమేమీ కాదు.

జులైలోను, జనవరిలోను రెండు కేసుల్లోను ఉపయోగించిన పదాలు ముస్లిం మహిళలను కించపరిచే, అసహ్యకరమైన దుర్మార్గపు పదాలన్నది స్పష్టంగా అందరికీ తెలుస్తున్నప్పుడు అలాంటి పదాలతో యాప్‌ను గిట్ హబ్ ఎలా అనుమతించింది. ఈ పదాలను మైక్రోసాఫ్ట్ అనుమతించిందంటే ఆ కంపెనీ ఎలాంటి మానవవిలువలను కలిగి ఉంది? ఈ సంఘటనలపై ఇప్పటి వరకు మైక్రోసాఫ్ట్ కాని, ట్విట్టరు కాని స్పందించనే లేదు. కేవలం యాప్‌లను తొలగించడం మాత్రమే చేశాయి. అది కూడా విమర్శలు వెల్లువెత్తిన తర్వాత.

ఈ టెక్ కంపెనీల గుట్టును విజిల్ బ్లోయర్ సోఫీ జాంగ్ ఇంతకు ముందు బట్టబయలు చేసింది. ఈ కంపెనీలు లాభాల కోసం ఏమేం చేస్తాయో స్పష్టంగా బయటపెట్టింది. ముంబయి పోలీసులు ఈ కేసుకు సంబంధించి అడిగిన వివరాలు కూడా ఈ కంపెనీలు అందించడానికి సిద్ధంగా కనబడడం లేదు. కోర్టు వారంటు ఉంటే తప్ప ఇవ్వమని మెలికలు పెడుతున్నాయి.

ఈ కేసులో ముంబయి పోలీసుల దర్యాప్తులో మరికొన్ని

నిజాలు ముందుకు వచ్చాయి. ముస్లిములు, శిక్కులకు మధ్య చిచ్చు పెట్టేలా అనేక యాప్‌లు సామాజిక మాధ్యమాల్లో ఉన్నాయని తెలుస్తున్నది. ముంబయి పోలీసులు ఈ విషయం తెలియజేశారు. ఈ యాప్‌లన్నీ శిక్కు సంస్థలు తయారు చేసిన యాప్‌లుగా ముందుకు వచ్చాయి. మొన్నటి కేసులో అసలు దోషులు వేరుగా కనిపించారు. అరెస్టులు జరిగాయి. శిక్కులకు, ముస్లిములకు మధ్య వైరాన్ని, విద్వేషాన్ని రాజేసేలా ఈ యాప్‌లు పని చేస్తున్నాయి. కొత్తగా హిందూ మహిళలను అత్యంత దుర్మార్గంగా వేలం వేస్తూ మరో యాప్ ముందుకు వచ్చింది. టెలీగ్రామ్ వేదికగా ఈ యాప్ ముందుకు వచ్చింది. ఈ విషయంలోను విమర్శలు వెల్లువెత్తిన తర్వాత ప్రభుత్వం ఈ యాప్‌ను బ్లాక్ చేయించింది. కాని ఎలాంటి అరెస్టులు జరగలేదు. హిందూ మహిళలను కించపరిచే ఈ దుర్మార్గపు పనికి పాల్పడిన వారెవరైనా సరే కనిపెట్టి వారిని కఠినంగా శిక్షించవలసిన అవసరం ఉంది. ఈ యాప్ ఎవరు తయారు చేశారు? ఎవరు ఈ దుర్మార్గం వెనుక ఉన్నారన్నది ప్రజల ముందుకు రావాలి.

విచిత్రమేమిటంటే, ముంబయి పోలీసులు ఒక కేసులో కాస్త పురోగతి సాధించి అరెస్టులు చేసిన వెంటనే నిందితుల పట్ల సానుభూతి సృష్టించే ప్రయత్నాలు ఆన్‌లైన్లో ప్రారంభమయ్యాయి. బాలీవుడ్ సెలబ్రిటీ జావెద్ అక్తర్ బాధితులకు ఉచిత సలహాలు ఇచ్చారు. నిందితురాలు శ్వేతా సింగ్ వయసు చాలా చిన్నదని, ఆమె తల్లిదండ్రులు క్యాన్సర్ వల్ల చనిపోయారని కాబట్టి సానుభూతి చూపించాలన్నది జావెద్ అక్తర్ గారి అభిప్రాయం. అలాగే బీజేపీ కార్యకర్త ప్రీతీ గాంధీ కూడా చాలా సానుభూతి ఒలకబోశారు. టీవీ యాంకర్ రాహుల్ కంవల్ కూడా తన సానుభూతి ప్రకటించేశారు. కాని ఈ సానుభూతి వచనాలను నెటిజన్లు తీవ్రంగా నిరసించారు. జావిద్ అక్తర్, రాహుల్ కంవల్ ఇంతకు ముందు అత్యంత కఠినంగా వ్యవహరించాలంటూ, కొందరి పట్ల చేసిన వ్యాఖ్యలను కూడా కొందరు ప్రస్తావించి, అప్పుడు గుర్తుకురాని చిన్న వయసు ఇప్పుడు ఎలా గుర్తొస్తుందని ప్రశ్నించారు. ఏది ఏమైనా ఈ నిందితుల పట్ల సానుభూతి సృష్టించే ప్రయత్నాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయన్నది స్పష్టం.

మరోవైపు బెంగుళూరు నుంచి అరెస్టయిన విద్యార్థి చదువుతున్న ఇంజనీరింగ్ కాలేజీ కూడా చాలా సానుభూతితో ఆ విద్యార్థిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని చెప్పింది. ఇదే సానుభూతి అన్ని సముదాయాల పట్ల చూపిస్తున్నారా అన్నది అందరూ ఆలోచించవలసిన ప్రశ్న.

ఈ మొత్తం కేసులో గుర్తించవలసిన ముఖ్యమైన విషయాలేమిటంటే--

మహిళలను ఆన్‌లైన్ వేదికలపై వేలానికి పెట్టడం జరిగింది.

ముస్లిం మహిళలను లక్ష్యంగా చేసుకున్నారన్నది రెండవ విషయం.

ముస్లిములకు, శిక్కులకు మధ్య చిచ్చుపెట్టేలా ఈ యాప్‌లను శిక్కు సంస్థలు సృష్టించినవిగా చిత్రించడం జరిగింది.

కొత్తగా హిందూ మహిళలను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి ప్రయత్నమే జరిగింది.

అంటే వివిధ మతవర్గాల మధ్య విద్వేషాన్ని రాజేసే ప్రయత్నాలు పెద్ద స్థాయిలో జరుగుతున్నాయి.


ఒకవైపు హరిద్వార్ ధర్మసంసద్‌లో కొందరు మతపెద్దలు హింసాకాండ, మారణకాండలకు పిలుపునిస్తున్నారు.

మరోవైపు నోయిదా వంటి ప్రాంతాల్లో శుక్రవారం నమాజుకు పాలనాయంత్రాంగం కేటాయించిన ప్రదేశాల్లో నమాజులు చేయకుండా ముస్లిములను అడ్డుకోడానికి గుంపులు దాడులకు తెగబడుతున్నాయి. శిక్కులు ముందుకు వచ్చి తమ ప్రదేశాలను నమాజుకు ఇచ్చారు. కొందరు హిందువులు కూడా ముందుకు వచ్చి ముస్లిములకు నమాజు ప్రదేశాలను ఇచ్చారు.

ఇప్పుడు ఆన్‌లైన్లో ముస్లిం మహిళలను వేలంపాటకు పెట్టిన యాప్‌లు శిక్కు సంస్థలు తయారు చేసినవిగా చిత్రిస్తూ ముందుకు వచ్చాయి. మరోవైపు హిందూ మహిళలపై కూడా ఇలాంటి దుర్మార్గపు యాప్ తయారు చేశారు. ఈ సంఘటనలన్నీ సమాజంలో పెరుగుతున్న విద్వేష వాతావరణానికి అద్దం పడుతున్నాయి.

ఈ కేసులో అరెస్టయిన వారు రెండు పదుల వయసులో ఉన్న యువత. దేశంలో నిరుద్యోగం ఇప్పుడు దాదాపు 21 శాతానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగాల్లేవు, ఉపాధి కార్యకలాపాలు లేవు. ఆదాయం లేదు. ఈ కేసులో అరెస్టయిన ప్రధాన ముద్దాయి శ్వేతా సింగ్ నేపాల్ నుంచి ఎవరో ఇచ్చిన సూచనలపై పనిచేసినట్లు కూడా ఒక సమాచారం బయటకు వచ్చింది. అంటే ఈ యువత ఏదో తమకు తోచింది చేశారనుకోడానికి వీలు లేదు. దక్షిణాన బెంగుళూరు మొదలు ఉత్తరాన ఉత్తరాఖండ్ నుంచి నేపాల్ వరకు విస్తరించిన ఒక నెట్వర్క్ స్పష్టంగా కనిపిస్తోంది. ✤

'చరితార్థులు'



# అల్లామా సయ్యద్ అబ్దుల్ కరీం గని (1907-1978)

111

**భారత** జాతీయ ప్రభుత్వాధినేత నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రధాన సలహా మండలిలో ఒకరుగా బాధ్యతలు నిర్వర్తించిన అల్లామా సయ్యద్ అబ్దుల్ కరీం గని 1907లో తమిళనాడు రాష్ట్రం శివగంగ జిల్లా సొడుగుడి గ్రామంలో జన్మించారు. ఆయన తండ్రి ముహమ్మద్ ఇబ్రాహీం బ్రతుకుదెరువు నిమిత్తం బర్మాలోని రంగూన్ చేరుకోగా కరీం గని విద్యాభ్యాసం రంగూన్‌లో సాగింది. చిన్ననాటి నుండి స్వతంత్ర భావాలను వ్యక్తంచేస్తూ కవి, రచయితగా మాత్రమే కాకుండా రంగూన్ నుండి వెలువడుతున్న వివిధ పత్రికల్లో బాధ్యతలు నిర్వహించిన ఆయన నిబద్ధతగల పాత్రికేయునిగా గుర్తింపు పొందారు. ఆంగ్లం, తమిళం, ఉర్దూ, అరబిక్, ఫార్సీ, బర్మీస్ భాషలలో ప్రావీణ్యం సంపాదించి మంచి వక్తగా ఆయన ఆదరణ పొందారు. 1928లో జాతీయోద్యమ నాయకులు మౌలానా ముహమ్మద్ అలీ జౌహర్ పరిచయం కావడంతో భారత జాతీయోద్యమం దిశగా ఆయన ఆలోచనలు మళ్ళాయి. 1930లో 'ఉదయ సూరియన్' అను పత్రికను బర్మాలో ఆరంభించారు. ప్రజల సంక్షేమం–అభివృద్ధి కోసం ప్రధానంగా ముస్లిం యువత కోసం ఆయన పలు సంస్థలను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఆ క్రమంలో సయ్యద్ కరీం గని బర్మా శాసనసభకు ఎన్నికయ్యారు. ఆ సమయంలో ఆజాద్ హింద్ ఫౌజ్ అధినేత సుభాష్ చంద్రబోస్‌తో అల్లామా సయ్యద్ అబ్దుల్ కరీం గని మంచి పరిచయం ఏర్పడింది. ప్రజాప్రతినిధిగా, సంపాదకునిగా ఖ్యాతి గడించిన ఆయన శక్తిసామర్థ్యాలు, విద్వత్తు తెలుసుకున్న నేతాజీ, అబ్దుల్ కరీం గని తనతో కలసి పని చేయుటకు ఆయనను ఆహ్వానించారు. 1943 జూలైలో సుభాష్ చంద్రబోస్ భారత జాతీయ సైన్యాన్ని పునర్వ్యవస్థీకరించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాక భారత జాతీయ ప్రభుత్వం స్వభావాన్ని, స్వరూపాన్ని, సైద్ధాంతికతను ప్రజలకు వివరించే బాధ్యతను ఆయనకు అప్పగించారు. భారత జాతీయ సైన్యంలోని యోధులను ఉత్తేజపర్చి 'ఛలో ఢిల్లీ' నినాదాన్ని సాకారం చేసేందుకు అవసరమైన ప్రచార సామగ్రిని రూపొందించడం లాంటి బాధ్యతలను కరీం గని చేపట్టారు. నేతాజీ ప్రధాన సలహాదారుల బృందంలో ఒకరుగా, మంత్రిత్వశాఖ కేటాయించని మంత్రిగా భారత జాతీయ ప్రభుత్వంలో కరీం గని బాధ్యతలను నిర్వహించారు. 1945 ఆగస్టులో ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో జపాన్ పరాజయం కావడంతో భారత జాతీయ సైన్యం వెనుకడుగు వేయగా ఆయన మలయా వెళ్ళారు. ఆయనను బ్రిటిష్ ప్రభుత్వ సైన్యం మలయాలో అరెస్టు చేసింది. ఆ తరువాత నిర్బంధం నుండి విడుదలైన కరీం గని బర్మా, మలయా, ఇండియా, పాకిస్తాన్‌లోని వివిధ భాషా పత్రికల సంపాదకవర్గం సభ్యునిగా పని చేశారు. ప్రజల పక్షంగా ఉద్యమాలలో పాల్గొంటూ వచ్చిన ఆయన పలుమార్లు ప్రభుత్వాల ఆగ్రహానికి గురయ్యారు. పలు ప్రచురణ సంస్థలకు మార్గదర్శకం చేస్తూ, వివిధ భాషలలో ఆయన గ్రంథాలను రచించారు. పాకిస్తాన్ నుండి వెలువడుతున్న DAWN ఆంగ్ల దినపత్రిక సంపాదకవర్గ సభ్యునిగా బాధ్యతలు నిర్వహిస్తూ 1978లో అల్లామా సయ్యద్ అబ్దుల్ కరీం గని అంతిమశ్వాస విడిచారు. ✤



✆ 9440241727

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్ర కారుడు, బహుగ్రంథ కర్త **సయ్యద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ 'చరితార్థులు' (తెలుగు) 'ది ఇమ్మోర్టల్స్' (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం




రచన: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూదీ (రహ్మ) | సంక్షిప్తీకరణ, అనువాదం: ఎస్.ఎమ్ మలిక్

# 4. క్రైస్తవం

## క్రైస్తవంలో యుద్ధం లేకపోవడానికి కారణం

క్రైస్తవంలో యుద్ధం, సంధి, పరిపాలన, రాజకీయాలు, శిక్షాస్మృతి తదితర అంశాలు ఎందుకు లేవు, తౌరాత్‌లోని తత్సంబంధిత ఆదేశాలను యధాతథంగా ఎందుకు ఉండ నివ్వడం జరిగిందో ఇక వివరించనవసరంలేదు. క్రైస్తవం ఆ ఆదేశాలలో ఏ ఒక్క దాన్నీ, వాటిలోని ఒక్క అక్షరాన్నీ నిరాక రించలేదు. అయితే క్రీస్తు ఆ ఆదేశాలను అమలుపరచలేక పోవడానికి కారణం, ఆయన ఆవిర్భవించిన కాలంలో ఆ ఆదేశాలను అమలుపరిచే అవకాశమేదీ లేకపోవటమే.

క్రీస్తు ప్రభవన కాలంలో ఆయన జాతి దాదాపు ఏడెనిమిది వందల ఏళ్ళుగా పర జాతి బానిసత్వంలో మ్రగ్గుతోంది. ఆయన జననానికి 60 ఏళ్ళ పూర్వం రోమను సైన్యం పాలస్తీనాపైన దాడి జరిపి దాన్ని ఒక మూల నుండి మరో మూల వరకు కాలరాస్తూ పోయింది. క్రీస్తు కళ్ళు తెరచినప్పుడు ఆయన జాతి మొత్తం రోమనుల బానిసత్వంలో బందీ అయి ఉండేది. ఆయన స్వదేశ యూదియా రాజ్యం క్రీ.శ. 6వ సంవత్సరాన నేరుగా రోమను రాజ్యాధికారుల ఏలుబడిలోకి వెళ్ళిపోయింది. వారు ప్రొక్యూరేటర్ (Procurator) అనబడేవారు. ఆయన దైవదౌత్య కార్యం (సందేశం) ప్రారంభం కాగా ఎరూషలేము ప్రొక్యూరేటర్ పొన్తోస్ పీలాతుస్ (Pontius Pilate) వంటి అన్యాయ వర్తనుడు, మనస్సాక్షి అంటూ లేని వాడుండేవాడు.

ఇటువంటి అధర్మమయిన నాయకుల బానిసత్వంలో బనీ ఇస్రాయీల్ బౌద్ధికంగానూ నైతికంగానూ ఎంతగా దిగజారి పోయి ఉంటుందో, సత్యవాక్కు వినడానికి కూడా ఏ విధంగా సిద్ధంగా లేకపోయిందో అంచనా వేయవచ్చు. క్రీస్తు కళ్ళ ముందర గిలేత పాలకుడు హీరోదు కేవలం ఓ నాట్యకత్తెను సంతసింపజేయడానికి హజ్రత్ యహ్యా (అ) (Jhon of Baptist) ని హత్యజేయించాడు. స్వయాన క్రీస్తు విలువ కూడా ఆ జాతి దృష్టిలో ఏమయి ఉండేదో తెలుసుకునేం దుకు, చివరి దశలో బనీ ఇస్రాయీల్ నిర్వహించిన పాత్రను గమనిస్తే చాలు. బనీ ఇస్రాయీల్, బర్నబ్బా అనే దొంగ ప్రాణాన్ని క్రీస్తు ప్రాణం కన్నా విలువయినదిగా పరిగణిం చింది. ఇటువంటి విషమ పరిస్థితుల్లో క్రీస్తు (అ) తన సందేశ కార్యక్రమం ప్రారంభంలోనే యుద్ధం జెండా లేవనెత్తడం ఎలా సాధ్యమయ్యేది? యుద్ధం చేసి, పోరాడి ఒక స్వతంత్ర

మయిన ధార్మిక ప్రభుత్వం స్థాపించడం ఆయన వల్ల ఎలా సాధ్యమయ్యేది??

ఆయన కళ్ళారా చూస్తున్నారు, యూదుల నుండి వారి ధార్మిక ఆత్మ ఎప్పుడో దూరమయిపోయింది. వారి శీల స్వభావాల్లో ఎటువంటి పటిష్ఠత లేదు, వారిలో ఓ జాతిగా ఎటువంటి జీవం అంటూ లేదు. అందువల్ల ఆయన చేయదగిన ప్రప్రథమ కర్తవ్యం, తన జాతి ఏ నైతిక పతనావస్థలో, ఏ పతనావస్థ ఊబిలో పడి కొట్టుమిట్టాడుతోందో అందులో నుంచి బయట పడేలా చెయ్యడం! అది ఏ పతనావస్థలో పడి ఉందో అందులో నుంచి లేవనెత్తడం, అందులో నైతికతా ఔన్నత్యపు జీవాన్ని, ఆత్మను నూరిపోయడం, అలా చెయ్యనిదే ఏ జాతి అయినా ప్రపంచంలో బానిసత్వపు శృంఖలాలను త్రెంచి తన సర్వ స్వతంత్రతా వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోజాలదు. కనుక ప్రథమంగా ఆయన జాతీయ శీల స్వభావాల నిర్మాణం వైపునకు శ్రద్ధ మళ్ళించారు. తన ఈ కర్తవ్యాన్ని పూర్తి చెయ్యడానికి ఆయన నిరంతరంగా ప్రభుత్వంతో ఘర్షణ పడకుండా జాగ్రత్త పడుతూ వచ్చారు. ఎందుకంటే ప్రారంభంలోనే ప్రభుత్వంతో తలపడవలసివస్తే తన సంస్కరణా కార్యక్రమం లోనూ లోటు వస్తుంది. ఆ కార్యక్రమం పూర్తి కాకపోవడం చేత, అటు ప్రభుత్వంతోనూ తలపడటంలో వైఫల్యం ఎదుర్కోవలసి వస్తుంది. అందువల్ల ఆయన ప్రభుత్వంతో ఘర్షణ పడకుండా అత్యంత జాగ్రత్త వహిస్తూ వచ్చారు. అందుకే ఆయన్ని పట్టించడానికి యూదు పండితుల వేగుల వారు కైసరుకు, మేము పన్ను చెల్లించవలెనా వద్దా అని ప్రశ్నించినప్పుడు ఆయన ద్వంద్వార్థాల జవాబు చెప్పి తప్పించుకున్నారు :

"కైసరువి కైసరునకును దేవునివి దేవునికిని చెల్లించుడని" వారితో చెప్పెను. *(లూకా : 20: 22)*

ఆయన ఆదేశించారు, "దుర్మార్గుల్ని ఎదిరించరాదని, మీ పైన దౌర్జన్యం చేసినవారికి మీరు మంచిని కోరండి, అతనికి శుభం కలగాలని అభిలషించండి, మిమ్మల్ని వెట్టిలో పట్టి చాకిరి చేసుకునే వానితో మీరు ఒక కోసుకు బదులు రెండు కోసులు నడవండి; మీ అంగిని దోచుకునేవానికి మీ పైవస్త్రాన్ని తీసి ఇచ్చివెయ్యండి; మీకు ఒక చెంపపైన దెబ్బ కొడితే అతనికి రెండవ చెంప కూడా అందజెయ్యండి". ప్రారంభంలో ఈ ఆదేశాలన్నింటి ఉద్దేశ్యం, ప్రభుత్వంతో ఘర్షణ కూడదన్నది, ఆపైన జాతిలో ఆపదల్ని తట్టుకునే శక్తి జనించాలన్నది. ఆ తరువాత ఆయన తన జాతికి, క్రమేణ స్థయిర్యం, సహనం, నిగ్రహం, నిర్భయతల్ని బోధించసాగారు. వారిని కష్టాలను ప్రమాదాలను ఎదుర్కొనేందుకు సన్నద్ధులుగా చెయ్యసాగారు, వారి హృదయాల నుండి మృత్యు భయాన్ని పారద్రోలి ఏలిన వారి ఆగ్రహాన్ని వారి శక్తి పట్ల భయాం దోళనల్ని తీసి వెయ్యడానికి ప్రయత్నం చేశారు. ఆయన ఇలా బోధించారు కూడా :

"వారు మిమ్మును సభలకప్పగించెదరు; మిమ్మును సమాజ మందిరములలో కొట్టించెదరు; మీరు వారికి సాక్ష్యార్థమై అధిపతుల యెదుటను రాజుల యెదుటను నా నిమిత్తము నిలుపబడెదరు.. నా నామము నిమిత్తము అందరిచేత మీరు ద్వేషించబడుదురు; అంతము వరకు సహించినవాడే రక్షణ పొందును."

*(మార్కు : 13: 9-13)*

ఆయన ప్రాణ ప్రియత్వాన్ని హృదయాల నుండి పారద్రోలడానికి మరణానికి సంసిద్ధులవడానికి ఇలా బోధించారు :

"తన ప్రాణమును రక్షించుకొనగోరువాడు దానిని పోగొట్టుకొనును, నా నిమిత్తమై తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దానిని రక్షించుకొనును."

*(లూకా : 9: 24)*

ఆయన ప్రభుత్వం దాని కటాక్షం పట్ల నమ్మకం కలిగి ఉండటానికి బదులు దైవం, ఆయన దాతృత్వం పట్ల భరోసా కలిగి ఉండే బోధనలు చేశారు. తద్వారా బానిసత్వపు బలహీనత దూరమవ్వాలని ఉద్దేశించారు. ఈ బలహీనతే ఓ బానిస జాతిని పాలక జాతి మాయాజాలంలో పాలితుల్ని సమ్మోహితుల్ని చేసి పెడుతుంది. ఆయన ఇలా బోధించారు:

"కాబట్టి మీరు చెడ్డవారై యుండియు, మీ పిల్లలకు మంచి యీవులనియ్య నెరిగి యుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి పరిశుద్ధాత్మను ఎంతో నిశ్చయముగా అనుగ్రహించుననెను." *(లూకా : 11: 12, 13)*

ఆయన ప్రభుత్వ భయాన్ని హృదయాల నుండి తొలగించడానికి ప్రయత్నించారు, ఆయన ప్రజలకు తెలిపిన దాని ప్రకారం ఎవరయితే కేవలం శరీరాన్ని అంతమొందించగలరో వారు ఆత్మను చంపలేరు, వారికి భయపడనవసరం లేదు, వాస్తవానికి భయపడవలసింది ఆత్మను, శరీరాన్ని రెంటినీ

చంపేవాడికే అని బోధించారాయన. *(లూకా : 12: 4-5)*

ఈ విషయాలన్నీ శతాబ్దాల బానిస జాతిలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పొందే అర్హత పెంపొందించేందుకు అవసరమయినవి. ప్రారంభంలో క్రీస్తు వీరి వరకే తన బోధనల్ని పరిమితం చేసిపెట్టారు. ఈ దశ దాటిన తరువాత చివరి రోజుల్లో ఆయన జిహాద్, యుద్ధం, పోరాటం విషయాల వైపునకు మరలేవారు. ఒక్కోసారి తమ శత్రువుల్ని సంహరించే కోరిక సయితం వెలిబుచ్చేవారు. ఒక సందర్భంలో ఇలా ఆదేశించారు :

> మరియు నేను తమ్మును ఏలుటకు ఇష్టములేని నా శత్రువులను ఇక్కడికి తీసుకొని వచ్చి నా యెదుట సంహరించుడని చెప్పెను. *(లూకా : 19: 27)*

ఇదేవిధంగా ఆయన (అలైహిస్సలామ్) తన అనుయాయుల్ని ఖడ్గం ధరించి ఉండాలని కూడా ఆదేశించి ఉన్నారు, లూకాలో వ్రాయబడి ఉంది :

> అందుకాయన ఇప్పుడైతే సంచిగలవాడు సంచియు జొలెయు తీసికొనిపోవలెను; కత్తిలేనివాడు తన బట్టనమ్మి కత్తి కొనుక్కొనవలెను; ... వారు- ప్రభువా, ఇదిగో ఇక్కడ రెండు కత్తులున్నవనగా- చాలునని- ఆయన వారితో చెప్పెను. *(లూకా : 22: 36-38)*

కాని క్రీస్తు (అలైహిస్సలామ్)కు తన జాతికి సన్మార్గం చూపడానికి కేవలం రెండున్నర లేదా మూడు సంవత్సరాల కాలమే ప్రాప్తమయింది. ఇంత తక్కువ వ్యవధిలో ఒక పూర్తి జాతిని దైవమార్గాన సతత సమరానికి (జిహాద్ ఫీ సబీలిల్లాహ్‌కి) సమాయత్తపరచడం సాధ్యపడదు. ఇంత తక్కువ కాలంలో ఆయన(అలై) అనుయాయుల సంఖ్య కూడా రోమనులను ఎదిరించతగ్గ పెద్ద సంఖ్యగా పెరగలేకపోయింది. ఇంకా వారి నైతిక శిక్షణ కూడా ప్రవక్తశ్రీ(స) సహచరుల వలే సంపూర్ణం కాలేదు; ధైర్యసాహసాలతో సకల విధాల ప్రమాదాలను ఖాతరు చెయ్యకుండా ఇంటిల్లిపాదిని వదలి హిజ్రత్ చెయ్యడానికీ, అతి పెద్ద శక్తుల్ని నిర్భయంగా ప్రాణాలొడ్డి ఎదుర్కోవడానికీ సమాయత్తమయ్యేందుకు! క్రీస్తు (అలై)కు అత్యంత ప్రీతిపాత్రుడయిన, విశ్వసనీయుడయిన శిష్యుడు పీటరు (పేతురు) స్థితి ఎలా ఉండేదంటే అతన్ని బంధించే ముందు అతన్ని, నీవు కూడా క్రీస్తు శిష్యుడివేనా అని అడిగినప్పుడు అతను, 'కోడి రెండు మారులు కూయక మునుపే' ముమ్మారు ఏసును ఎరుగనని చెప్పాడు. (మార్కు : 14: 30) ఆయన శిష్యుడు మరొకడు ఇస్కరియోతు యూదా 30 వెండి నాణెములకు బదులుగా ఏసు (అలై)ని బంధించి అప్పగించాడు (మత్తయి : 26: 14). ఆయన్ని బంధించిన తరువాత ఆయన (అలై) శిష్యులందరు ఆయన్ని వదలి పారిపోయారు (మత్తయి: 26: 56). ఆయన ప్రత్యేక శిష్యుల పరిస్థితి ఇలా ఉంటే ఇలాంటి అవిశ్వసనీయ సేనను తీసుకుని జిహాద్ పోరుకు ఎలా సాహసించగలరాయన (అలై)?

ఆయన (అలైహిస్సలామ్)కు కూడా ప్రవక్త మహనీయులు (సల్లల్లాహు అలైహి వ సల్లమ్)కు వలే సుశిక్షణకు సమయం అవకాశం ప్రాప్తమయి ఉన్నట్లయితే ప్రవక్త మహనీయులు (స) తన సహాబా (రజి)లో ఏ విధంగా జిహాద్ ఊపిరిని పోశారో అదేవిధంగా ఆయన(అలై) కూడా తన శిష్యగణంలోనూ పోరాట ప్రవృత్తిని సృజించగలిగేవారేమో! కాని తల బిరుసు గల ఆయన జాతి ఆయన(అలై) నుబువ్వత్‌ని మూడు సంవత్సరాలు కూడా భరించలేకపోయింది, ఆయనకు ఆ జాతి శ్రేయో సంక్షేమ కార్యాలకు ఏదయినా బృహత్కార్యాన్ని నిర్వహించే వ్యవధిని సయితం ఇవ్వలేకపోయింది. ఆ అతి తక్కువ కాలంలో అత్యధికంగా మహనీయ క్రీస్తు (అలై) చెయ్యగలిగినంత సత్కార్యమే కాగలిగేది. స్వయంగా మహనీయ ముహమ్మద్(స) మక్కాలో గడిపిన తొలి మూడు సంవత్సరాలను పరికించినా అక్కడా జిహాద్ పోరాటం ఎక్కడా పేరుకు కూడా కానరాదు. అదే సహనం, నిగ్రహం, సహన స్థయిర్యాలు, దైవభీతి, నిష్ఠ, దైవంపైన భారం మోపడం, ఆత్మ ప్రక్షాళనం, నైతిక పరిశుద్ధత ఇత్యాది బోధనలే దర్శనమిస్తాయి. అవే ఇక్కడ ఏసుక్రీస్తు (అలై) జీవనం, బోధనల్లోనూ కానవస్తాయి. ✤


గీటురాయి వారపత్రిక

**ముఖ్య ఆశయాలు**

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.




# ఏమిటీ ఘోరం?

- ఆయిషా సుల్తానా,
ఖమ్మం

**ఎక్కడ** స్త్రీలు గౌరవింపబడతారో అక్కడ దేవతలు సంచరిస్తారు, అంటోంది మన సంస్కృతి. కానీ దీనికి భిన్నంగా స్త్రీల ఆత్మాభిమానాన్ని దెబ్బ తీస్తూ కొందరు కీచకులు చేస్తున్నటువంటి వికృత చేష్టలు దేశాన్ని దేశ సంస్కృతిని తలదించుకునేలా చేస్తున్న ఘటనలు నేడు మనం చూస్తున్నాం. మరీ ముఖ్యంగా ఒక వర్గం వారిని టార్గెట్ చేసి మరీ.. అమ్మాయిల ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి.. వేలం నిర్వహిస్తున్నారు. దీని కోసం ప్రత్యేకంగా ఓ యాప్‌నే సృష్టించారు. అదే "బుల్లిబాయ్". ఇటీవల ఈ యాప్, అమ్మాయిలను వేలం వేయడం గురించి ఓ నెటిజన్ సోషల్ మీడియాలో వెల్లడించడంతో వైరల్ అయింది. దీనిపై నెటిజన్లతోపాటు ప్రజలందరి నుంచి ఆగ్రహం వ్యక్తమైంది. 'బుల్లీ బాయ్' పేరిట యాప్‌ను సృష్టించి వికృత చేష్టలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి. వీటితో పాటు మరిన్ని క్లోన్ యాప్‌లు కూడా ఉన్నాయి. బుల్లి బాయి, సుల్లీ డీల్స్ పేరుతో వాటిల్లో వందల సంఖ్యలో ఓ వర్గానికి చెందిన అమ్మాయిలు, మహిళల ఫొటోలు అప్‌లోడ్ అయ్యాయి.

బుల్లీ బాయ్ యాప్ వెలుగులోకి రావడానికి ఆరు నెలల ముందే, అంటే, గతేడాది జులై మాసంలో 'సుల్లీ డీల్స్'అనే యాప్ ఒకటి సరిగ్గా ఇదే తీరులో దుమారం రేపింది. ఈ యాప్‌లోనూ ముస్లిం మహిళల ఫొటోలను ఉంచి, వాళ్లను వేలం వేయడం, పర్సనల్ డేటాను, ఫొటోలను బహిర్గతం చేయడం, నీచ కామెంట్లు పెట్టడం లాంటి ఉదంతాలు జరిగాయి. విచిత్రం కాకుంటే అప్పుడు సుల్లీ డీల్స్ యాప్ కూడా సరిగ్గా ఇదే మైక్రోసాఫ్ట్ వారి GitHub ఇంటర్నెట్ హోస్టింగ్ ప్లాట్‌ఫామ్‌లోనే తయారైంది. ఆ సందర్భంలోనూ పెద్ద దుమారం చెలరేగడం, సంస్థకు ఫిర్యాదులు వెళ్లడంతో సుల్లీ డీల్స్ నిషేధానికి గురైంది. అప్పటి కేసును పోలీసులు ఇంకా దర్యాప్తు చేస్తూనే ఉన్నారు.

## బుల్లీ బాయి యాప్‌లో ఏముంది?

బుల్లి బాయి యాప్‌ని ఓపెన్ చేయగానే ముస్లిం మహిళల ఫొటోలు కనిపిస్తాయి. యాప్‌లోని మహిళల చిత్రాలపై అసభ్యకరమైన వ్యాఖ్యలతో వేలం వేశారు. ఆ వేలం పాట రోజున సోషల్ మీడియాలో Bulli Bai హ్యాష్ ట్యాగ్ విపరీతంగా ట్రెండ్ అయింది. శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది ముంబై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ యాప్ బాగోతం బహిర్గతమైంది. బాధిత మహిళలు కూడా బుల్లి బాయి యాప్ పై ఫిర్యాదులు చేశారు.

పలు రంగాల్లో పాపులరైన ముస్లిం మహిళల ఫొటోలను యాప్‌లో ఉంచి, వాళ్లను సొంతం చేసుకోండంటూ వేలం పాట నిర్వహించారు. గతంలోనూ ఇలాంటిదే సుల్లీ డీల్స్ అనే యాప్ ఇదే మైక్రోసాఫ్ట్ వారి గిట్ హబ్ వేదికగా తయారైంది.

బుల్లి బాయి.. Bulli Bai.. కొత్త ఏడాది తొలి రోజు నుంచీ విపరీతంగా ట్రెండ్ అవుతోందీ పదం. ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ మైక్రోసాఫ్ట్ వారి గిట్‌హబ్ ప్లాట్‌ఫామ్‌లో రూపొందించిన బుల్లి బాయి యాప్ ముస్లిం మహిళలే టార్గెట్‌గా వికృతాలకు వేదికైంది. ఇటీవలె దేశవ్యాప్తంగా బుల్లి బాయి యాప్ గురించి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. పలు రంగాల్లో పాపులరైన ముస్లిం మహిళల ఫొటోలను యాప్‌లో ఉంచి, వాళ్లను సొంతం చేసుకోండంటూ వేలం పాట నిర్వహించారు. దేశ ప్రతిష్ఠకు మచ్చలా పరిణమించిన ఈ బుల్లి బాయి ఉదంతంపై కేంద్ర ప్రభుత్వం వేగంగా స్పందించాలి.

## టార్గెట్ ఆ ముస్లిం మహిళలే..

బుల్లీ బాయి యాప్ ఏదో యాదృచ్ఛికంగా ముస్లిం యువతుల ఫొటోలు నింపిన యాప్ కానేకాదు. కచ్చితమైన లక్ష్యంతోనే, ఎంపిక చేసుకున్న సుమారు 100 మంది మహిళల్ని వేలానికి ఉంచారు. ఆ మహిళలు అందరూ ఫేస్‌బుక్, ట్విటర్ లాంటి సోషల్ మీడియా వేదికలపై ముస్లిం వాణిని, మహిళల వాదనను బలంగా వినిపిస్తున్నవారే కావడం గమనార్హం. సమాజంలో తమదైన ముద్ర వేసిన ముస్లిం మహిళలనే బుల్లీ బాయ్ యాప్ టార్గెట్ చేసింది. సోషల్ మీడియా వేదికగా ఎవరు ధైర్యంగా మాట్లాడతారో వాళ్ల ఫొటోలనే దారుణంగా కించపరిచారు.

## బాధితులు భయపడకుండా...

బుల్లీ బాయి యాప్ బాధితురాళ్ల జాబితాలో ముస్లిం మహిళా జర్నలిస్టులూ ఉన్నారు. ఈ యాప్ వల్ల తాము ఏ స్థాయి నరకాన్ని చూశామో చాలా మంది ధైర్యంగా వెల్లడించారు. యాప్ దురాగతాన్ని బయటపెడుతూ తమకు ఎదురైన కష్టాలను పంచుకున్నారు. సాధారణ ప్రజానీకం తనను మానసికంగా ఎలా హింసించారో వివరిస్తూ ఓ మహిళా జర్నలిస్ట్ పెట్టిన పోస్టు ఈ ఉదంతంలో కీలకంగా మారింది.

## బుల్లీ బాయి ఎవరి పని?

బాధితురాళ్లు, ఎంపీ ప్రియాంక ఫిర్యాదు ప్రకారం బుల్లీ బాయ్ యూనీఫామ్ రీసెర్చ్ లొకేటర్ (యూఆర్ఎల్) URL bullibai.github.io అని ఉంది. ఈ గిట్ హబ్ అనేది మైక్రోసాఫ్ట్ వారి వేదిక కావడం గమనార్హం. గూగుల్ ప్లే స్టోర్ తరహా గిట్ హబ్‌లో ఎవరైనా ఒక యాప్‌ను రూపొందించి, దాన్ని యూజర్లకు అందుబాటులోకి తీసుకురావచ్చు. సాధారణ భాషలో, GitHub అనేది ఇంటర్నెట్ హోస్టింగ్ ప్లాట్‌ఫారమ్. యాప్‌లు మరియు సాఫ్ట్‌వేర్‌లు అభివృద్ధి చేసుకునే, ప్రారంభించుకునే స్పేస్ అనమాట. వినియోగదారులు అనేక రకాల యాప్‌లను పొందే ఓపెన్ ప్లాట్‌ఫారమ్. ఈ ప్లాట్‌ఫారమ్ వినియోగదారులను యాప్‌లను సృష్టించడానికి లేదా భాగస్వామ్యం చేయడానికి అనుమతిస్తుంది. గిట్ హబ్ 2008లో అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో ప్రారంభమైంది. దీని ప్రస్తుత CEO థామస్ డోమ్కే.

బుల్లీ బాయి యాప్ వికృతాలపై సోషల్ మీడియాలో పెను దుమారం రేగడంతో కేంద్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పందించారు. గిట్ హబ్ ప్లాట్‌ఫారాన్ని వాడుకునే యూజరే ఈ యాప్‌ను రూపొందించాడని మంత్రి తెలిపారు. మైక్రోసాఫ్ట్ సంస్థకు ఫిర్యాదు చేసిన వెంటనే గిట్ హబ్ నుంచి బుల్లీ బాయి యాప్‌ను తొలగించారని, యాప్ రూపొందించిన వినియోగదారుణ్ని కూడా గిట్ హబ్ నిషేధించిందని మంత్రి తెలిపారు. అదే సమయంలో కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్, పోలీసులు సైతం తమ దర్యాప్తును కొనసాగిస్తారని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

ముస్లిం మహిళల ఫొటోలను అభ్యంతరకరంగా మార్ఫింగ్ చేసి ఆన్‌లైన్‌లో వేలానికి పెట్టిన 'బుల్లీ బాయ్' యాప్ వ్యవహారంపై ముంబయి, ఢిల్లీ పోలీసుల దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది.

అలాగే, ఆ యాప్ సంబంధిత సమాచారాన్ని ట్విటర్‌లో తొలిసారిగా ఎవరు పోస్ట్ చేశారు? వారికి ఆ యాప్ గురించి ఎలా తెలిసింది అనే విషయాలపై కూపీ లాగుతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని ట్విటర్‌కు లేఖ రాశారు. ఆ యాప్ సంబంధిత పోస్టులతోపాటు ఇతర అభ్యంతరకర సమాచారాన్ని తొలగించాలని ట్విటర్‌ను ఆదేశించినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. 'బుల్లీ బాయ్' యాప్ వ్యవహారాన్ని ఢిల్లీ మహిళా కమిషన్ కూడా తీవ్రంగా పరిగణించింది.

ఈ యాప్‌నకు సంబంధించి మీడియాలో వచ్చిన కథనాలను సుమోటోగా స్వీకరించింది. జనవరి 6న తమ ముందు హాజరు కావాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. మరోవైపు, ఈ కేసుకు ముంబయి సైబర్ సెల్ పోలీసులు బెంగళూరుకు చెందిన 21 ఏళ్ల ఇంజినీరింగ్ విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, అనుమానిత యువకుడి వివరాలను ముంబయి పోలీసులు వెల్లడించలేదు. యువకుడిపై ఐపీసీ సెక్షన్లు, ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేశారు.




**అతియా సిద్దీఖ...** జమాఅతె ఇస్లామీహింద్ నేషనల్ ఉమెన్స్ వింగ్ సెక్రటరీగా, హాదియా ఇ-మ్యాగ్జిన్ ఎడిటర్‌గా, ముస్లిమ్ పర్సనల్ లా బోర్డు వర్కింగ్ కమిటీ మెంబర్‌గా సేవలందిస్తున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతానికి చెందిన అతియా బాధ్యతల రీత్యా ఢిల్లీలో ఉంటున్నారు. సంస్థాగత పనుల్లో భాగంగా దేశంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తుంటారు. ఇటీవలె ఆమె తెలంగాణలోని పలు జిల్లాలతోపాటు హైదరాబాద్‌లోనూ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమెతో కాసేపు ముఖాముఖిగా మాట్లాడితే పలు విషయాలు వెల్లడించారు. దేశంలో స్త్రీల స్థితిగతులు, మరీ ముఖ్యంగా మైనారిటీ, దళిత మహిళలపై జరుగుతున్న దారుణాలపై ఆమె మాట్లాడారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ కోసం జమాఅతె ఇస్లామీహింద్ చేస్తున్న కృషిని వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

జమాఅతె ఇస్లామీహింద్ ఉమన్స్ వింగ్, స్త్రీ సాధికారత, విద్య, ఆరోగ్యం కోసం ఎంతో కృషిచేస్తోంది. మరీ ముఖ్యంగా ఇస్లామ్‌లో స్త్రీలకు స్వేచ్ఛ లేదు, వారికి హక్కులు లేకుండా అణచి వేయబడుతున్నారు అనే అపోహలను తొలగిస్తోంది. ముస్లిమ్ బాలికలకూ చదువు ప్రాముఖ్యతను వివరిస్తున్నాము. అమ్మాయిల్లో అక్షరాస్యత పెంచేందుకు మా అనుబంధ సంస్థలెన్నో పనిచేస్తున్నాయి. గృహిణులను ఆర్థికంగా ఎదిగేలా పలు ప్రోత్సాహకాలను అందిస్తున్నాము. వృత్తి శిక్షణలను అందించి వారికి తోడ్పాటునందించేలా శిక్షణా సంస్థల్ని నడుపుతున్నాము. హైదరాబాద్‌లో అల్ ఖైర్ సంస్థ ఆ పనే చేస్తుంది. స్త్రీలూ వ్యాపార, వాణిజ్య రంగాల్లో రాణించేందుకు రిఫా చాంబర్ ద్వారా అవకాశాలు కల్పిస్తున్నాం. ముస్లిమ్ సమాజంలో ఉన్న పేదరికం, నిరక్ష్యరాస్యత తొలగిపోవాలంటే ముస్లిమ్ మహిళలు చదువుకోవాలని మేము బలంగా నమ్ముతాము. ఒక్క మహిళ ఎన్నో కుటుంబాల తలరాతను మార్చగలదు. గతంలో కంటే ముస్లిమ్ సముదాయంలో మంచి మార్పు వస్తోంది. చదువుల్లో ముస్లిమ్ యువతులు రాణిస్తున్నారు.

### షాహీన్ బాగ్ ఉద్యమం తరువాత ముస్లిమ్ స్త్రీల పట్ల దృక్పథం మారింది..

సీఏఏ-ఎన్నార్సీకి వ్యతిరేకంగా చేపట్టిన షాహీన్‌బాగ్ ఉద్యమం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ముస్లిమ్ మహిళల

ఉద్యమ స్ఫూర్తి నిజంగా చారిత్రకమనే చెప్పవచ్చు. స్కూలు అమ్మాయిలు మొదలుకొని, యూనివర్శిటీలో చదువుకునే అమ్మాయిలు, గృహిణులు, దాదీమాలు అంతా ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. వారంతా మీడియా ముందుకొచ్చి మాట్లాడిన తీరుకు ప్రపంచం నివ్వెరపోయింది. ముస్లిమ్ మహిళలంటే వంటింటి కుందేళ్లు అనే అపోహ షాహీన్‌బాగ్ ఉద్యమం పూర్తిగా తుడిచేసింది.

### ఈక్వాలిటీ కాదు జస్టిస్ కావాలి...

సమాజంలో స్త్రీ స్వేచ్ఛ, సమానత్వం పేరిట మహిళలు ఎలా మోసపో తున్నారో మనం చూస్తూనే ఉన్నాం. సమానత్వం పేరుతో మహిళలను మోసగించడం, భ్రమల్లో ముంచడం జరుగుతోంది. స్త్రీ పురుషుల మధ్య భౌతికంగా కనబడుతున్న భేదాలను, సమాజంలో వారు పోషించవలసిన పాత్రలను అన్నింటినీ పక్కన పెట్టి బలవంతంగా మహిళలను పురుషుల రంగాల్లోకి నెట్టడం జరుగుతోంది. ఫలితంగా మహిళల్లోని స్త్రీత్వమే దెబ్బతిని విపరీత పరిణామాలు సంభవిస్తున్నాయి. పాశ్చాత్య సంస్కృతి మహిళలను రోజురోజుకూ దిగజార్చుతోంది. ఫ్యాషన్, స్వేచ్ఛ పేరుతో మహిళల అస్తిత్వాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తున్నారు. ఈక్వాలిటీ కాకుండా మహిళకు అన్ని రంగాల్లో సమన్యాయం చేసినప్పుడే మహిళల తలరాతలు మారుతాయి.

### పెళ్లి వయసు పెంచడం తగదు..

గణాంకాల ప్రకారం పోషకాహార లోపం కారణంగానే స్త్రీలలో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. కాబట్టి ఈ సమస్యను పరిష్కరించకుండా అమ్మాయిల పెళ్లి వయసు పెంచడం సరైన పరిష్కారం కాదు. పైగా 21 ఏళ్లకు పెంచడమంటే మరో కొత్త సమస్యను కొనితెచ్చుకున్నట్లవుతుంది. అమ్మాయిల భద్రత సవాలుగా మారుతుంది.

### మోరల్ ఎడ్యుకేషన్ అవసరం..

చదువంటే ఉద్యోగం కోసమే అన్నట్లు తయారైంది నేటి విద్యావ్యవస్థ. ఈ పరిస్థితి మారాలి. సభ్యత, సంస్కారం నేర్పాలన్నది చదువుల లక్ష్యమ వ్వాలి. మన సిలబస్‌లో నైతిక విలువలు పెంపొందించే పాఠ్యాంశాలు చేర్చాలి. నైతిక పరివర్తన రానంతకాలం మన సమాజంలో మహిళల పట్ల వ్యవహరించే ధోరణి మారదని గుర్తించాలి. మద్యాన్ని సమూలంగా నిషేధించాలి. ఎన్నో కాపురాలను కూలుస్తున్న మద్యం మహమ్మారిని నిషేధించనంతకాలం మహిళల భద్రత గాలిలో దీపంలానే ఉంటుంది. మద్యం, మత్తు పదార్థాలను ప్రభుత్వం నిషేధించాలి. స్త్రీల పురోగతి, భద్రతతోనే సమాజ అభ్యున్నతి సాధ్యమవుతుంది.


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి
గీటురాయి వారపత్రికను
తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా
పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా
పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే
డి.డి.ని 'Geeturai Weekly'
పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# అన్యాయానికి గురైనవారికి సహాయపడండి

-నసీరా బేగం

**అది** కారుణ్యమూర్తి మహాప్రవక్త ముహమ్మద్(స) దైవ సందేశాన్ని మక్కా ప్రజలకు చేరవేస్తున్న కాలం. ఆ సత్య సందేశాన్ని కొంత మంది ప్రజలు స్వీకరిస్తున్న కాలం. సత్య తిరస్కారులు వారిపై హద్దులు మీరి దౌర్జన్యం చేస్తున్న కాలం. అందులో అబూ జహల్ దౌర్జన్యపరులందరికీ నాయకుడు. ప్రజలను ఇష్టం వచ్చినట్లు దోచుకుంటున్నాడు. అటువంటి కాలంలో యమన్ దేశస్తుడు ఒకతను మక్కా నగరానికి వ్యాపార నిమిత్తం ఒంటెలను అమ్మటానికి తీసుకొచ్చాడు. అందరి కంటే ముందు ఎదురొచ్చి అధిక ధర నిర్ణయించి ఆ ఒంటెలను అబూ జహల్ కొనేశాడు. ఎందుకంటే అతనికి ధర చెల్లించే సంకల్పమే లేదు. కాని కొన్ని రోజుల తరువాత ధర చెల్లిస్తానని ఆ వ్యాపారికి వాగ్దానం చేశాడు. ఆ వాగ్దానానుసారం ఆ వ్యాపారి అబూ జహల్ వద్దకు వెళ్ళి ధర చెల్లించమని కోరాడు. కాని అతను డబ్బులివ్వకుండా ఇంకా కొన్ని రోజుల సమయం తీసుకున్నాడు. ఆ వ్యాపారి కొన్ని రోజులు ఆగి మళ్ళీ అబూ జహల్ వద్దకు వెళ్ళి డబ్బులివ్వమని అడిగాడు. కాని అతను మళ్ళీ కొన్ని రోజుల సమయం కోరాడు. ఈ విధంగా ఒకసారి కాదు రెండు సార్లు కాదు ఎన్నోసార్లు అతను ఆ వ్యాపారిని తిప్పి పంపించాడు. అంతే కాదు, అతని పట్ల దురుసుగా వ్యవహరించటం, దౌర్జన్యం చెయ్యటం ప్రారంభించాడు. ఎన్నో ఆశలతో ఒంటెలను అమ్మిన ఆ వ్యాపారి ఆందోళన చెందసాగాడు. అతనికి విషయం అర్థం కావటం లేదు. ధర ఇవ్వకపోయినా తీసుకున్న ఒంటెలనైనా తిరిగి ఇచ్చెయ్యమని అడిగితే దానికీ అబూ జహల్ ఒప్పుకోవటం లేదు. అతనికి చెప్పుకోవటానికి ఎవరూ లభించటం లేదు. సహాయం అడుగుదామనుకుంటే అతనికి ఎవరూ పరిచయస్తులు కనబడటం లేదు. ఎందుకంటే అతను ఒక పరాయి దేశస్తుడు. అతనికి ఏమీ పాలుపోవటం లేదు. ఆందోళనతో మక్కా వీధులన్నీ తిరుగుతున్నాడు. ఎవరైనా సహాయం చేసేవారు దొరక్కపోతారా అని.

అంతలో ఒకచోట కొంత మంది గుమిగూడి కూర్చుని ఉన్నారు. పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. అది అక్కడ కూర్చున్నవారికి రోజువారి అలవాటు. పొద్దెక్కిన తరువాత వారందరూ కాబా గృహ సమీపంలో ఉన్న దారుల్ నద్వా దగ్గర చిన్న చిన్న సమూహాలుగా ఏర్పడి పిచ్చాపాటి మాట్లాడుకుంటారు. వారిని చూసిన ఆ వ్యాపారి సంతోషపడ్డాడు. అక్కడ అతనికి సహాయం తప్పకుండా లభిస్తుందని ఆశించాడు. వడివడిగా అడుగులేస్తూ వారి వద్దకు వెళ్ళాడు. జరిగిన వృత్తాంతమంతా వారికి వివరించాడు, సహాయం చెయ్యమని వారిని అభ్యర్థించాడు.

వృత్తాంతాన్నంతటినీ విన్న ఆ ప్రజలు ఒకరి ముఖం మరొకరు చూసుకోసాగారు. ఆ రౌడీ మూకతో ఎవరు తలపడతారా అని కళ్ళతోనే ఒకరినొకరు ప్రశ్నించుకోసాగారు. ఎవరూ ధైర్యాన్ని చూపలేకపోయారు. కాని వారిలో ఒక తుంటరివాడున్నాడు. అతను తుంటరితనంగా ఎదురుగా కాబా గృహానికి ఒక ప్రక్కన కూర్చుని ఉన్న దైవప్రవక్త(స)ను చూపిస్తూ ఆయన వద్దకు వెళ్ళి నీ గోడును

వినిపించు. ఆయన తప్పకుండా నీకు అబూ జహల్ నుంచి డబ్బులిప్పిస్తారు అని అన్నాడు.

నీటిలో మునిగేవాడికి ఒక గడ్డి పరక ఆధారంగా దొరికితే చాలు అన్నట్లుగా ఉంది అతని పరిస్థితి. అతను ఏమీ ఆలోచించకుండా వడివడిగా అడుగులేసుకుంటూ దైవప్రవక్త(స) గారి వద్దకు చేరుకున్నాడు. ఆయన(స) గారి ముఖవర్చస్సును చూసి ఎంతో ప్రభావితుడయ్యాడు. ఈ వ్యక్తి తప్పకుండా సహాయపడతారనే నమ్మకం అతనికి ఏర్పడింది. అతను తన బాధనంతా దైవప్రవక్త (స) గారికి విన్నవించుకున్నాడు. ఆయన(స) వెంటనే అతన్ని తీసుకుని అబూ జహల్ ఇంటికి వెళ్ళారు. అబూ జహల్ ఇల్లు కాబా గృహానికి సమీపంలో ఉన్న సఫా మర్వా కొండల సమీపంలో ఉంది.

దైవప్రవక్త(స) వ్యాపారిని తీసుకుని అబూ జహల్ ఇంటికి వెళ్తున్న దృశ్యాన్ని అక్కడ గుమిగూడి కూర్చున్న ప్రజలు ఆ తుంటరివాడు చూస్తున్నారు. సంతోషపడుతున్నారు. ఇప్పుడు ఇద్దరి మధ్య ఒక పెద్ద ఘర్షణ జరుగుతుందని ఎదురు చూశారు. అంతలో ఒకతన్ని లేపి నువ్వు వారిద్దరి కంటపడకుండా రహస్యంగా వెళ్ళి అక్కడి దృశ్యాన్ని చూసి వచ్చి మాకు వివరించు అని పంపారు. అతను రహస్యంగా ఒకచోట దాగి చూడసాగాడు.

దైవప్రవక్త(స) దుర్మార్గుడైన అబూ జహల్ ఇంటి ద్వారం వద్దకు చేరుకున్నారు. తోడుగా ఆ వ్యాపారి కూడా ఉన్నాడు. తలుపు తట్టి 'ఓ అబూ జహల్! బయటికి రా' అని గంభీరంగా కేకవేశారు. దైవప్రవక్త(స) గారి కంఠ స్వరాన్ని విన్న అబూ జహల్ వణుకుతున్న చేతులతో తలుపు తెరిచాడు. తలుపు తెరవగానే దైవప్రవక్త(స) గారితోపాటు ఆ వ్యాపారి కూడా ఉండటాన్ని చూసి అవాక్కయ్యాడు. దైవప్రవక్త(స) గంభీర వదనంతో 'ఓ అబూ జహల్! ఇతనికి ఇవ్వవలసిన ఒంటెలకు సంబంధించిన డబ్బులు ఇచ్చెయ్యి' అని అన్నారు. అంతే అది విన్న అతను 'ఆ...ఆఁ.. ఇప్పుడే తెచ్చిస్తాను' అని ఒక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా ఇంటి లోపలకు వెళ్ళాడు. వెంటనే డబ్బులు చేత పట్టుకుని వచ్చి గౌరవంగా దైవప్రవక్త(స) గారి చేతిలో పెట్టాడు. దైవప్రవక్త(స) ఆ సొమ్మును ఆ వ్యాపారికి అందజేశారు. ఆ వ్యాపారి అమితానంద భరితుడయ్యాడు. దైవప్రవక్త(స) గారికి కృతజ్ఞతలు తెలుపుకుంటూ 'దేవుడు మీకు మంచి బదులును ప్రసాదించు గాక!' అని పదే పదే పలుకుతూ కాబా గృహం వద్ద కూర్చున్న ఆ ప్రజల వద్దకు కూడా వెళ్ళి ఇవే పలుకులను వల్లించాడు.

ఇది విన్న ఆ ప్రజలు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. దైవప్రవక్త(స) గారి ప్రాణ శత్రువై ఉండి కూడా ఎలాంటి ఘర్షణ చెయ్యకుండా పిల్లిలా భయపడిపోయాడేమిటి అని మాట్లాడు కుంటున్నారు. అంతలో వారు పంపిన ఆ వ్యక్తి కూడా తిరిగి వచ్చాడు. అక్కడ చూసిన వృత్తాంతాన్నంతటిని పూసగుచ్చినట్లుగా వివరించాడు. అది విన్న వారు ఒకరి ముఖాలు ఒకరు చూసు కుంటున్నారు. అబూ జహల్ ముహమ్మద్(స)కు భయపడట మేమిటి? వారికి అర్థం కావటం లేదు. అంతలోనే చెమటలో తడిసి ముద్దయిపోయి దడదడలాడుతున్న గుండెపై చెయ్యి పెట్టుకుని బలహీనంగా వారి వద్దకు వచ్చి కూర్చున్నాడు. అతడిని చూసిన వారి నోట మాట రావటం లేదు. కొంతసేపటికి తేరుకుని 'ఓ అబూ జహల్! ఏమిటి, ఏమైంది ముహమ్మద్(స)ను చూసి అలా భయపడిపోయావు?' అని మెల్లగా అడిగారు.

అబూ జహల్ మెల్లగా నోరు విప్పి చెప్పసాగాడు. ఏమి చెప్పను. అబూ జహల్! అనే కేకను లోపల నుంచి వినగానే నా గుండె దడదడలాడసాగింది. తలుపు తెరిచి చూడగానే అక్కడి దృశ్యాన్ని చూసి ఇంకా నా మతి చలించిపోయింది. ఏమీ అర్థం కాలేదు. ముహమ్మద్(స)తోపాటు ఆ వ్యాపారి. ఫరవాలేదు. కాని ముహమ్మద్(స) భుజాలపై మృగ జంతువులు పెద్దగా నోరు విప్పి క్రూరంగా నా వైపునకే చూస్తున్నాయి. డబ్బులిచ్చేస్తావా లేదా కబళించి వేయాలా? అని వాటి పెద్దపెద్ద దంతాలు, వాటి ఎర్రని కళ్ళు నన్ను ప్రశ్నిస్తున్నాయి. డబ్బులివ్వకపోయినట్లయితే వాటికి ఆహారమైపోతానేమో అని నాకు అనిపించింది. కాని కొన్ని డబ్బుల కోసం నా విలువైన ప్రాణం బలి ఇచ్చేంత మూర్ఖుడిని కూడా కాదు కదా! అందుకోసం నేను డబ్బులు ఇచ్చేసి తెలివిగా తప్పించుకున్నాను అని అన్నాడు.

ఎంతో ఆసక్తిగా సంఘటనంతా వింటున్నవారందరూ నిట్టూర్చారు. ముహమ్మద్ అల్లాహ్ పంపిన ప్రవక్త అని స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ అబూ జహల్, అతని స్నేహితులు ఇదంతా మంత్రజాలం అని త్రోసిపుచ్చారు.

తెలుగు చేతిలో సత్య దీపిక
నిత్య వేదిక
గీటురాయి
వారపత్రిక

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్హీముల్ ఖుర్ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది      ఖుర్ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**75 ఆయత్‌లు**

# 39. అజ్ జుమర్

**మక్కా అవతరణ**

67 – 68 వీరు అల్లాహ్‌కు విలువ నివ్వవలసిన ధర్మం రీత్యా విలువనివ్వనే లేదు.[75] (ఆయన పరిపూర్ణ శక్తిసామర్థ్యాల స్థితి ఏమిటంటే) ప్రళయదినాన ఈ పుడమి అంతా ఆయన పిడికిలిలో ఉంటుంది, ఆకాశాలు ఆయన కుడిచేతికి చుట్టబడి ఉంటాయి.[76] పరిశుద్ధుడు, వీరు కల్పించే బహుదైవభావనకు అతీతుడాయన.[77] ఆ రోజున బాకా ఊదబడుతుంది.[78] ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్నవారంతా చచ్చిపడిపోతారు– అల్లాహ్ బ్రతకనివ్వాలని కోరుకున్నవారు తప్ప. తరువాత మరొక బాకా ఊదబడుతుంది, మరి ఎకాఎకీన యావన్మంది లేచి చూడటం మొదలెడతారు.[79]

75. అంటే, వారికి అల్లాహ్ మహోన్నత మహిమాన్విత గొప్పదనం గురించి ఎటువంటి అవగాహనా లేదు. విశ్వ సామ్రాట్టు అయిన దైవం స్థానం ఎంత ఉన్నతమయిందో, ఇంకా ఈ మూర్ఖులు దైవత్వంలో భాగస్వాములుగా, ఆరాధనకు యోగ్యులుగా భావించిన ఆ అల్పమయిన అస్తిత్వాలు ఏ మాత్రమయినవో వీరు అర్థం చేసుకునే ప్రయత్నమే చేయలేదు.

76. భూమీ ఆకాశాలపైన పరమ ప్రభువు అల్లాహ్ సంపూర్ణ ఆధిపత్యాన్ని, ఆయన వినియోగాధికారాన్ని చిత్రీకరించడానికి ఆయన పిడికిట ఉన్నట్లు, ఆయన చేతికి చుట్టబడి ఉన్నట్లు ఉపమానంగా చెప్పడం జరిగింది. ఒక వ్యక్తి చిన్నపాటి బంతిని పిడికిలిలో వత్తేసి పట్టుకున్నట్లు, అది అతనికి ఎంతో సాధారణ విషయమయినట్లే, లేదా ఒక వ్యక్తి చేతి గుడ్డను చుట్టేసి చేతిలో పెట్టుకున్నట్లు అదీ అతనికి కష్టమేమీ కానట్లే అదే విధంగా ప్రళయదినాన మానవులంతా, (నేడు దేవుని మహిమాన్విత గొప్పదనాన్ని ఊహించలేకపోతున్నవారు) తమ కళ్ళతో చూసుకుంటారు - భూమీ ఆకాశాలు అల్లాహ్ శక్తి హస్తంలో ఒక అల్పమయిన బంతి, ఒకింత చేతిగుడ్డ వంటివే అని. ముస్నద్ అహ్మద్, బుఖారీ, ముస్లిమ్, నసాయి, ఇబ్నుమాజ, ఇబ్ను జరీర్ మొదలయిన గ్రంథాల్లో హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్, హజ్రత్ అబూ హురైరా (ర) ఉటంకించిన ఉల్లేఖనాలున్నాయి. వాటి ప్రకారం, ఒకసారి ప్రవక్త మహనీయులు (స) మింబర్(వేదిక) పైన ప్రసంగిస్తున్నారు. ప్రసంగం మధ్యలో ఈ ఆయత్ ఆయన పఠించారు. అప్పుడు ఇలా సెలవిచ్చారు, "అల్లాహ్, ఆకాశాలను, భూములను (అంటే గ్రహాలను) తన పిడికిట పట్టుకుని పిల్లవాడు బంతిని త్రిప్పినట్లు త్రిప్పుతాడు. అప్పుడు ఇలా ప్రవచిస్తాడు, నేనే ఒకే ఒక్క దైవాన్ని, నేనే సామ్రాట్టుని, నేనే మహా బలోపేతుణ్ణి, నేనే గొప్పదనానికి స్వామిని, భూమిలో చెలామణి అయిన రాజులేరి? నియంత లెక్కడ? పొగరుమోతులెక్కడ?" ఇలా చెబుతూ చెబుతూ ప్రవక్తశ్రీ (స) మరీ ఉద్ధృతంగా కంపించసాగారు. మేము భయపడ్డాము, ఆయన వేదికతో పాటు క్రిందపడిపోతారేమోనని.

77. అంటే, ఆయన మహిమ, గొప్పదనాల ప్రాభవమెక్కడా, ఆయనతో పాటు ఎవరయినా దైవత్వంలో భాగం పంచుకోవడం ఎక్కడ? (రెంటికీ ఏదయినా పోలిక ఉందా?)

78. 'సూర్' (బాకా) అనే దాని వివరణకు చూడండి, ఖుర్ఆన్ అవగాహనం, సం.2, అల్ అన్ఆమ్: పాదసూచి 47 సం.4, ఇబ్రాహీమ్ : పాద సూచి 57 అల్ కహ్ఫ్: ఆయత్ 99; తాహా: పాదసూచి 78 సం.5, అల్ హజ్జ్: పాదసూచి 1 అల్ మూ'మినూన్: ఆయత్ 101; అన్ నమ్ల్: పాదసూచి 106.

79. ఇక్కడ కేవలం రెండు పర్యాయాలు బాకా ఊదే ప్రస్తావన ఉంది. ఇవి కాక నమ్ల్ సూరాలో ఈ రెంటికి ముందు మరో పర్యాయం ఊదే ప్రస్తావన వచ్చింది. దాన్ని విని భూమీ ఆకాశాలలోని సమస్త సృష్టిరాశి భయవిహ్వాల అయిపోతుంది (అన్ నమ్ల్: ఆయత్: 87). ఈ కారణంగానే హదీసుల్లో బాకా మూడు పర్యాయాలు ఊదబడుతుందన్న ప్రస్తావన వచ్చింది. ఒకటి, తీవ్ర ఆందోళనపరిచే బాకా; రెండవది, కొట్టిపడవేసే బాకా; మూడవది, మానవులంతా బ్రతికి లేచి తమ ప్రభువు సన్నిధిలో హాజరయ్యేందుకు తమ గోరీల నుండి వెలువడే బాకా.

★★★

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (3వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమా (ర.అలై)**

**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

# రుణాల ప్రకరణం

### అధ్యాయం : 2

**ఎవరయితే ప్రజల సొమ్మును చెల్లించే ఉద్దేశంతో తీసుకుంటాడో, మరెవరయితే స్వాహా చేసే ఉద్దేశంతో పుచ్చుకుంటాడో...**

**572)** ప్రవక్త మహనీయులు (సఅసం) ఈ విధంగా ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) ఉల్లేఖించారు: "ఎవరయినా జనుల ధనాన్ని తిరిగి చెల్లించే సంకల్పంతో అరువుగా తీసుకుంటే, అల్లాహ్ కూడా అతని తరఫున అప్పును తీరుస్తాడు. మరెవరయినా ఎగ్గొట్టే ఉద్దేశంతో (అప్పు) తీసుకుంటే, అతనిని అల్లాహ్ సర్వనాశనం చేసేస్తాడు."[1]

### అధ్యాయం : 3 రుణాలు తీర్చటం

**573)** హజ్రత్ అబూజర్ (రజి) వివరించారు : నేను ప్రవక్త మహోదయుల (సఅసం) వెంట ఉన్నాను. ఆయన(స) ఉహుద్ పర్వతాన్ని చూసినప్పుడు ఇలా అన్నారు: "ఉహుద్ పర్వతం మేరు పర్వతంగా మారిపోయినా, అందులోని ఒక్క దీనార్‌కు సమానమైన బంగారం నా దగ్గర మూడు రోజుల కన్నా ఎక్కువగా ఉండటాన్ని నేను సుతరామూ ఇష్టపడను– నేను అప్పు చెల్లించడానికి ఉంచుకున్న ఆ దీనార్ తప్ప." పిదప ఇలా అన్నారు: "చూడు! ఎక్కువ ధనం కలవారే అగత్యపరులు[1]. అయితే తమ ధనాన్ని ఈ విధంగా ఖర్చు చేసేవారు మాత్రం అలాంటి వారు కారు."[2] ఉల్లేఖకులైన అబూ షిహాబ్ తన ముందు వైపు, కుడి వైపు, ఎడమ వైపు సంజ్ఞ చేశారు. "కాని అలాంటి వారు బహు కొద్దిమంది మాత్రమే." తరువాత ఆయన(స) నన్నుద్దేశించి, "ఇక్కడే ఉండు" అని చెప్పి కొంతదూరం ముందుకు వెళ్ళారు. (అప్పుడు ఆయన ఎవరితోనో సంభాషణ జరుపుతున్నట్లు) శబ్దం వినిపించింది. నేను వెంటనే ఆయన దగ్గరకు వెళదామనుకున్నాను. కాని, "నేను తిరిగి వచ్చేవరకూ నీవు ఇక్కడే ఉండు" అన్న ఆయన(స) హితవు నాకు జ్ఞాపకం వచ్చింది. ఆయన(స) తిరిగి వచ్చిన తరువాత, 'దైవప్రవక్తా! ఇప్పుడే నేను ఏదో విన్నాను లేదా నాకేదో శబ్దం వినిపించింది. ఏమిటది?' అని అడిగాను. దానికాయన (స), "నువ్వు కూడా విన్నావా?" అని ప్రశ్నించారు. నేను 'అవున'ని బదులిచ్చాను. అప్పుడు ఆయన (స) ఇలా చెప్పారు: "నా దగ్గరకు జిబ్రీల్ (అలైహిస్సలాం) వచ్చి, మీ అనుచర సమాజం (ఉమ్మత్)లోని ఏ వ్యక్తి అయినా సరే, అల్లాహ్‌కు భాగస్వామిగా ఎవరినీ కల్పించకుండా ఉన్న స్థితిలో మరణిస్తే, అతను స్వర్గంలో ప్రవేశిస్తాడని అన్నారు. దానికి నేను, "ఒకవేళ అతను ఫలానా ఫలానా పాపాలు (దొంగతనం, వ్యభిచారం వంటి పాపాలు) చేసేవాడైనా సరేనా?" అని అడిగితే, 'అవును' అని జిబ్రీల్(అ) చెప్పారు.

---

572-1. అంటే అప్పు సకాలంలో తీర్చే సదుద్దేశంతో తీసుకుంటే అలాంటి రుణగ్రస్తునికి అడుగడుగునా అల్లాహ్ తోడ్పాటు లభిస్తుంది. వీలైతే ప్రపంచంలోనే అతని అప్పు తీరిపోతుంది. ఒకవేళ దారిద్ర్యం, ప్రకృతి వైపరీత్యాల కారణంగా అప్పు తీర్చకుండానే అతను చనిపోయినా అతను దైవసన్నిధిలో శిక్షార్హుడు కాడు. ఎందుకంటే అతని సంకల్పం స్వచ్ఛంగా ఉంది గనక. ఇక ఎవరయితే ఎగ్గొట్టే ఉద్దేశంతో అప్పు తీసుకుంటాడో అతని ప్రాపంచిక కార్య కలాపాలలో శుభం ఉండదు. పరలోకంలో కూడా అతను అవమానకరమయిన శిక్షకు గురికావలసి ఉంటుంది.

573-1. అంటే; పరలోకంలో వారికి లభించే పుణ్యఫలం తక్కువ అని భావం.

573-2. అంటే, వారు తమ డబ్బును పదేపదే లెక్కించి, ఉక్కు బీరువాలలో భద్రపరచి ఉంచరు. దేవుడిస్తూ ఉంటే దైవమార్గంలో ఖర్చు చేస్తూ ఉంటారు. అయితే ఈ ఖర్చు చేసే భాగ్యం కొద్దిమంది అదృష్టవంతులకే దక్కుతుంది. ఎక్కువ మంది పిసినారులై ఉంటారు. వారు స్వయంగా తినరు. ఇతరులకు కూడా తినిపించరు. ఈ డబ్బు సదా తమను అంటి పెట్టుకుని ఉంటుందని భావిస్తారు. కాని వారు పోయేటప్పుడు ఆ డబ్బు వారి వెంట రాదు.

ఇక చెల్లించవలసిన అప్పుల గురించి...

మనిషి తన దగ్గర డబ్బు ఉన్నప్పుడు, అన్నింటికంటే ముందు అతను చేయవలసిన పని అప్పు తీర్చటం. ఒకవేళ డబ్బు లేకపోతే, వీలైనంత తొందరగా అప్పుల భారం నుండి విముక్తి పొందాలన్న చింతన ఉండాలి. ఇలాంటి చింతన కలవారికి అండగా అల్లాహ్ ఉంటాడు.

ఇకపోతే మనిషి అవసరం లేకపోయినా అప్పులు చేయటం ధర్మ సమ్మతమేనా? కాదా? అంటే దీనిపై భిన్నాభిప్రాయాలున్నాయి. అప్పులు తీర్చే సదుద్దేశం ఉంటే సమ్మతమే. అబ్దుల్లాహ్ బిన్ జాఫర్ గారు అవసరం లేకపోయినా అప్పులు చేసేవారు. ఎందుకిలా చేస్తున్నారు? అని జనులు అడిగితే, "రుణ గ్రస్తుడు రుణం తీర్చేవరకూ అల్లాహ్ అతనికి తోడుగా ఉంటాడ"ని దైవ ప్రవక్త(స) చెప్పగా నేను విన్నాను. కాబట్టి అల్లాహ్ నాకు తోడుగా ఉండాలని నేను కోరుకుంటున్నాను అని ఆయన బదులిచ్చారు. ఇలాంటి సాదుస్వభావులు అరుదుగానే ఉంటారు. నేటి పరిస్థితుల్లో రుణభారం వాంఛనీయం కానే కాదు. ఎందుకంటే అప్పు చేయటం తేలికే. కాని అప్పు తీర్చటం చాలా కష్టం.




# ఇస్లామీయ సందేశం - విశ్వజనీన కేంద్రం - కాబా

**- ఎస్.ఎమ్. మలిక్**

**'జమ్‌జమ్'** శుభ జలం మూలంగా జుర్‌హుమ్ తెగకు చెందిన అనేక కుటుంబీకులు మహనీయ హాజిరా, ఇస్మాయిల్ వద్ద వారి ఆనతి మేరకు నివాసమేర్పరచుకున్నారు. వారి సౌజన్యశీలత మూలంగా వారితో ఆ తెగవారి సంబంధాలు ఎంతో అన్యోన్యంగా కొనసాగి ఆ జనావాసం ఓ ప్రేమపూర్వక సమాజంగా ఓ సుజన నగరంగా పరిణమించింది. ఇస్మాయిల్ పెరిగి పెద్దవాడయి యవ్వన దశకు చేరినప్పుడు జుర్‌హుమ్‌లోని గొప్ప కుటుంబీకులు తమ కన్యలను ఆయనకు వివాహంలో ఇవ్వడానికి ఉత్సాహపడ సాగారు. ఉల్లేఖనాల ప్రకారం ఓ కన్యతో ఆయనకు వివాహం జరిగింది. మహనీయ ఇబ్రాహీమ్‌కు ఆ కోడలు నచ్చలేదు. అందువల్ల మహనీయ ఇస్మాయిల్ ఆమెను వదలి మరో కన్యను పెళ్ళాడారు. ఆమెను ఇబ్రాహీమ్(అ) మెచ్చుకున్నారు. ఉల్లేఖనాల ప్రకారం మహనీయ హాజిరా, పుత్రుని తొలి పెళ్ళి తరువాతనే పరమపదించారు. ఈ రెండవ భార్య ద్వారానే మహనీయ ఇస్మాయిల్‌కు పన్నెండు మంది మగ సంతానం కలిగారు.

### కాబా పునాదులు

ఓ రోజు మహనీయ ఇస్మాయిల్ తన విల్లంబులు సరిచేసుకుంటూ ఉండగా మహనీయ ఇబ్రాహీమ్(అ) వచ్చి కలసుకున్నారు. యోగక్షేమాల విచారణ తరువాత మహనీయ ఇబ్రాహీమ్, తనకు దైవ గృహ నిర్మాణం చేసే దైవాదేశమయిందని, ఇస్మాయిల్ సహాయపడవలసి ఉంటుందని పలికారు. వెంటనే ఆ విధేయుడయిన సుపుత్రుడు తాను సహాయపడటానికి సిద్ధమేనని పలికారు. తండ్రీ కొడుకులు కలసి అలా దైవ నిర్దేశితమయిన చోట దైవ గృహం 'కాబా' నిర్మాణానికి పునాదులు వేసి గోడలు కట్టడం మొదలెట్టారు. గోడలు బాగా ఎత్తుగా లేపిన తరువాత, నేడు 'మకామె ఇబ్రాహీమ్' అనబడుతున్న ప్రఖ్యాత రాయిని తెచ్చి గోడ ప్రక్కన బెట్టి దానిపైన నిలబడి మహనీయుడు ఇబ్రాహీమ్ గోడలు పైకి, ఇంకా ఎత్తుగా నిలబెట్టారు. అలా 'కాబా' నిర్మాణమయింది. 'కాబా' ఏదో సాధారణమయిన ఆరాధనాలయం కాదు. దాన్ని తొలినాటి నుంచే ప్రత్యేకంగా ఇస్లామీయ ధర్మసందేశ కేంద్రంగా, ఓ విశ్వజనీన ధార్మిక ఉద్యమానికి నిలయంగా నిలబెట్టడం జరిగింది :

> నిశ్చయంగా జనుల కొరకు నిర్ణయమయిన ప్రథమ కేంద్ర గృహం మక్కా(బక్కా)లో నిర్మాణమయినదే. శుభప్రదమయినది, అది సమస్త ప్రపంచవాసుల కొరకు మార్గబోధన (కేంద్రం). ఇందులో ప్రస్ఫుటమయిన (అల్లాహ్) సూచనలున్నాయి. ఇబ్రాహీమ్(నిలబడిన) స్థలం ఉంది. మరెవరు ఇందులోకి ప్రవేశిస్తాడో అతనికి శాంతి ప్రాప్తిస్తుంది.
>
> (ఆలి ఇమ్రాన్: 96, 97)

ఒక్క విషయం ఇక్కడ మరువరాదు. 'కాబా' దైవ గృహ నిర్మాణం జరిగిన వెయ్యేళ్ళ తరువాత మహనీయ సులైమాన్(అలైహిస్సలామ్) కాలంలో 'బైతుల్ మక్దిస్' నిర్మాణం జరిగింది. అందువల్ల ప్రపంచంలో నిర్మాణమయిన ప్రార్థనకు ప్రథమ అభిముఖ కేంద్రం, ప్రథమ ఏకేశ్వరోపాసనా కేంద్రం కాబాయే. 'కాబా' నిర్మాణం పూర్తయిన సందర్భంలోనే మహనీయ ఇస్మాయీల్‌కు విశ్వప్రభువు దైవదౌత్య భారాన్నీ అప్పజెప్పినట్లు ద్యోతకమవుతుంది. ఆ విధంగా మక్కా, కాబా కేంద్రంగా మహనీయ ఇస్మాయీల్(అ) అరేబియా అంతటా, ఇంకా కాబా కేంద్రానికి వచ్చే జనం సమక్షంలో ఇస్లామ్ బోధనలు ప్రచారం చేసే కార్యక్రమం చేపట్టారని తెలుస్తోంది:

> ఈ గ్రంథంలో ఇస్మాయీల్ ప్రస్తావన చెయ్యి; అతను వాగ్దాన పాలకుడు, ప్రవక్త, దైవసందేశహరుడూను. అతను తన ఇంటి వారలను నమాజ్, జకాత్‌లను ఆదేశించేవాడు, తన ప్రభువు వద్ద ప్రసన్నత పొందినవాడు. (మర్యమ్ : 54, 55)

## హజ్జ్

> ఇంకా, ఇబ్రాహీమ్ కొరకు మేము ఈ గృహ స్థలాన్ని నిర్ధారించి నప్పటి విషయం. (అప్పుడు) ఈ నిర్దేశన ఇచ్చాము, 'నాతో పాటు ఎవ్వరినీ సహవర్తులుగా భావించరాదు, నా ఈ గృహాన్ని ప్రదక్షిణ చేసేవారి కొరకు, (నమాజ్ కొరకు) నిలబడే, రుకూ చేసే, సజ్దా చేసే వారి కొరకు పరిశుద్ధంగా ఉంచాలి. ఇంకా (ఇలా ఆదేశించాము), జనుల్లో హజ్జ్ కొరకు సర్వసామాన్య ప్రకటన చెయ్యాలి, నీ వద్దకు రావాలని, కాలినడకన, లేదా ప్రతి బహుదూర ప్రాంతం నుండి ఒంటెల మీద రావాలని. అలా వచ్చి చూడగలరు ఇక్కడ ఎలాంటి (ఇహపర) ప్రయోజ నాలున్నాయో, ఇంకా ఈ కొన్ని నిర్ణీత దినాలలో అల్లాహ్ వారికి ఇచ్చిన పశువులపైన దైవ నామం స్మరించాలని (అంటే కుర్బానీ చెయ్యాలని), అందులోనుంచి స్వయంగా వారూ భుజించాలి ఇంకా అగత్యపరులూ నిరుపేదలకూ పెట్టాలి."
> (అల్ హజ్జ్ : 26-28)

కాబా గృహం కేవలం పవిత్రమయిన ఆరాధనాలయం మాత్రమే కాదు. దాని కేంద్రీయ స్థానం, పవిత్రత కారణంగా అది ఆ ప్రాంతం- అరేబియా- అంతటికీ ఆర్థిక, నాగరిక, సాంస్కృతిక జీవనానికీ కేంద్ర నిలయంగా అలరారింది. హజ్జ్ కొరకు ఉమ్రా కొరకు దేశం మొత్తం నుంచి జనం ఆకర్షితులయి దాని వైపునకు మరలి వచ్చేవారు. విచ్ఛిన్నతలో, అనైక్యతలో కొట్టుమిట్టాడుతున్న అరేబియా వాసుల్లో సమైక్యతకు ఓ దారి దీనిమూలంగా ఏర్పడుతూ ఉండేది. విభిన్న ప్రాంతాల నుండి, వివిధ తెగల నుండి వచ్చే ప్రజలు నాగరిక సంబంధాలు ఏర్పరచుకునేవారు. కవన గోష్ఠులూ, కవితా పోటీల వల్ల వారి భాషా సాహిత్యాలకు వృద్ధివికాసాలు ప్రాప్తమయ్యేవి. వ్యాపార, వాణిజ్య లావాదేవీల వల్ల దేశంలోని ఆర్థిక అవసరాలు తీరేవి. నాలుగు పవిత్ర మాసాల కారణంగా సంవత్సరంలో మూడవ వంతు ప్రశాంతత, నిలకడ నెలకొనేది. అంటే రజబ్ నెల ఉమ్రాకు కేటాయిస్తే, జీకఅద, జిల్‌హజ్జ, ముహర్రమ్ నెలలు హజ్జ్ కొరకు కేటాయించుకునేవారు అప్పట్లో. ఆ నెలల్లో రాకపోకలు, రవాణా పరిస్థితులు, ప్రయాణాలు, సజావుగా ఉండేవి. కుర్బానీ పశువుల పవిత్రత వల్ల వాటిని ఎవ్వరూ ముట్టుకునేవారు కారు. ఇవన్నీ కాబా వల్ల ప్రాప్తమయిన శుభాలు!

ఇవన్నీ 'కాబా' ద్వారా ప్రాప్తమయ్యే ఐహిక లేదా ఇహపరమయిన ప్రయోజనాలయితే ఇక్కడ సమావేశమయిన ఒకే దేవుని ఆరాధకులు- ప్రపంచం నలుమూలల నుంచి దీపప్పురుగుల్లా దీపశిఖ వద్ద ఆకర్షితులయి ప్రోగయిన- దైవారాధకులంతా ఇస్లామీయ సందేశాన్ని, ఇస్లామ్ కాంతిని తమలో నింపుకుని తమ తమ ప్రాంతాలకు తిరిగివెళ్ళి ఆ కాంతిని, ఆ క్రాంతిని విరజిమ్మాలని ఉద్దేశించడం జరిగింది. ఇదే ఈ గృహం నిర్మిస్తూ ఆ తండ్రీ కొడుకులు చేసిన ప్రార్థనల సారాంశం :

> ఆ సందర్భాన్నీ గుర్తుంచుకోండి, అప్పుడు ఇబ్రాహీమ్ ప్రార్థించాడు, "ప్రభూ, ఈ నగరాన్ని శాంతికి నిలయం చెయ్యి, నన్నూ నా సంతానాన్నీ విగ్రహారాధన నుండి రక్షించు. ప్రభూ, ఈ విగ్రహాలు అనేక జనుల్ని మార్గవిహీనతకు గురిచేశాయి; కాబట్టి ఎవరయితే నా విధానాన్ని అనుసరిస్తారో వారు నా వారు, మరెవరయితే నా విధానానికి వ్యతిరేకులో, నీవు నిస్సందేహంగా క్షమాగుణం గలవాడవు, కారుణ్య స్వరూపు డవు". (14 ఇబ్రాహీమ్ : 35, 36)

పైన వచ్చిన ప్రస్తావనల ఆధారంగానే మహనీయ ఇస్మాయీల్(అ) దైవదౌత్య కృషి ఫలంగానే చాలాకాలం వరకు అరేబియాలో దేవుని ఏకత్వం, దైవారాధనా భావం, ఇతర ఇస్లామీయ బోధనలు ఆ ప్రాంతమంతటా వ్యాపించాయి. ఫలితంగా కేవలం అరేబియాలోనే కాక దక్షిణ భాగాన, తూర్పు, పడమర భాగాలలోనూ ఇస్లామీయ భావనలు, ఆరాధనా విధానాలు, ఇతర ధార్మిక సంప్రదాయాలు ఆచరణలో ఉండేవి. మహనీయ ముహమ్మద్(స) కాలం వరకు చాలా మటుకు మక్కా తదితర ప్రాంతాలలో బహు దైవారాధన, విగ్రహారాధనలు చోటుచేసుకున్నప్పటికీ కొందరు వ్యక్తులు 'హనీఫా'లనబడేవారుండేవారు. వారు తమ్ముతాము మహనీయ ఇబ్రాహీమ్(అ), ఇస్మాయీల్(అ) అనుయాయులమని చెప్పుకునే వారు. వారు విగ్రహారాధనను నిరసించేవారు, విగ్రహాల సమక్షంలో బలి ఇచ్చిన పశు మాంసాన్ని భుజించేవారు కారు. నమాజ్ (సలాత్) చేసేవారు, అది ఏ విధంగా చేసేవారో వివరాలు తెలియవు కాని వారు కాబాను అభిముఖం చేసుకునే చేసేవారని ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది. ఉల్లేఖనాల ద్వారా వారిలో కొందరి పేర్లు సేకరించడం కూడా సాధ్యమే. ఇదంతా మహనీయ ఇస్మాయీల్ (అలైహిస్సలామ్) సలపిన ధర్మప్రచార కృషి, ఆ తరువాత ఆయన అనుయాయుల ప్రయత్నాల వల్లనే జరిగి ఉంటుందని ఊహించ వలసి ఉంటుంది. కాబా కేంద్రీయత మూలంగా ఇదంతా జరిగి ఉంటుందనీ భావించవలసి ఉంటుంది.

(ఆధారం : సీరతె సర్వరె ఆలమ్ : సం.2; పు.52-56)




సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**నేటి** యువతలో నానాటికీ అభద్రతా భావం ఎక్కువైపోతోంది. అలాగే వయసు మీద పడిందని మదనపడే పెద్దలకీ కొదువ లేదు. ఇట్టి పరిస్థితుల్లో ఒకరి సమక్షంలో వారు ఆనందంగా గడపడానికీ, వారి మనోభావాలను వ్యక్తపరచడానికి, వారి ఫీలింగ్స్‌ని చెప్పుకోవడానికీ, 'నీకు నేనున్నాను' అన్న ఫీలింగ్ కలగటానికీ నిజమైన ప్రాణ మిత్రుడి అవసరం ఉంటుంది. ఇలా పిల్లల నుంచి పెద్దల వరకు, యువకుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ స్నేహాన్నే కాంక్షిస్తారు. ఆ స్నేహ కాంక్షని మనం పాలతో పోల్చవచ్చు. అవతలి వ్యక్తి ఇచ్చేది పంచదార అయితే మనలో కరిగిపోతుంది. ఉప్పయితే విరగ్గొడుతుంది. పెరుగయితే మన అస్థిత్వాన్ని మారుస్తుంది. నీరయితే పలుచన చేస్తుంది. కనుక మన పాలు ఎవరి పాలవ్వాలో మనమే నిర్ణయించుకోవాలి. 'నేను చాలా ఒంటరిని నాకంటూ ఎవరూ లేరు. ఎవరూ నన్ను అర్థం చేసుకోరు. అందరితో నేను కలవలేకపోతున్నాను' అన్న భావన నుంచి బయటపడాలి.

ఇక వృద్ధుల విషయమంటారా..! నిజంగా పరిశీలించి చూస్తే అసలైన జీవితం నలభై సంవత్సరాల తర్వాతే మొదలవుతుంది. ఇందుకు గొప్ప ఉదాహరణ ప్రవక్తలకు, ప్రవక్త పదవి 40 ఏండ్ల తర్వాత ప్రసాదించడమే. సగం జీవితం- ఇచ్చిన అనుభవ పరంపర నుంచి సరికొత్త జీవితం ప్రారంభించాలి. నిజంగా ఆ వయసు నుంచే కొత్త జీవితం ప్రారంభమవుతుంది అని అనుకుంటే ఆ సరికొత్త జీవితం మరింత ఆనందప్రదంగా ఉంటుంది. వృద్ధాప్యం వయసుకే గానీ, మనసుకి కాదని తెలుసు కోవాలి. మనిషి ఒంటరితనానికి, అశాంతికి, అసంతృప్తికి బద్ధ శత్రువొకటుంది. అది 'వ్యాపకం'. ఒక మంచి వ్యాపకం జీవితంలో కొత్త ఉత్సాహాన్నిస్తుంది. అర్థం చేసుకోగలిగితే, ఒక పుస్తకం లేదా ఒక గొప్ప వ్యక్తి చరిత్ర మనకి ప్రేరణ ఇస్తుంది. 'ఇలా చెయ్యి' అని శాసించకుండా ఎలా చేస్తే బావుంటుందో సలాహా ఇస్తుంది.

నేను, నా జీవితం, నా చదువు, నా ఉద్యోగం, నా కుటుంబం, నా బ్యాంక్ బ్యాలెన్సు అనుకుంటే నూతిలోని కప్పకీ ఒడ్డునున్న మనిషికీ తేడా ఏం ఉంటుంది చెప్పండి! కనుక జీవితం నిరాసక్తంగా అనిపించినప్పుడు ఒంటరితనంతో సతమతమైపోయే బదులు రోజుకో గంట, వారానికో రోజు, నెలకో నాలుగు రోజులు, ఏడాదికో యాభై రోజులు మనకంటు ఓ గుర్తింపునిచ్చిన సమాజం కోసం కేటాయించినప్పుడే జీవితానికి సార్థకత. సమాజ సేవ చేసినంత సేపూ ఇష్టంగా చేయాలి. అందులో మమేకమైపోవాలి. ఆ శ్రమలో కష్టం ఉండదు. అసలట అసలే అన్పించదు. ప్రతిఫలాన్ని కోరుకోము  కాబట్టి ఆశా నిరాశలుండవు. ఎవరో నెత్తిన కూర్చొని ఆజమాయిషీ చేస్తున్న భావనే కలుగదు. ఆ అదృష్టం సేవకులకే దక్కుతుంది.

“వితంతువులు, వికలాంగులు, అనాథల బాగు కోసం పాటుపడే వ్యక్తి నిరంతరాయంగా జిహాద్ చేసే వ్యక్తితో, నిర్విఘ్నంగా ఉపసవాసాలు ఉండే వ్యక్తితో, అవిశ్రాంతంగా దానధర్మాలు చేసే వ్యక్తితో సమానం” (బుఖారీ) అని ఆదర్శమూర్తి ముహమ్మద్(స) అన్నారంటే, ప్రజాసేవకు గల ప్రాధాన్యత ఏమిటో ఇట్టే అర్థమవుతుంది.

పరిమితమైన అనుభవాలతో, పరిమితమైన వ్యక్తుల మధ్య బతికే బతుకు, జైలు జీవితం కంటే ఎక్కువేం కాదు. మన ఇల్లు, మన కుటుంబం, మన స్నేహితులు అంతా ఇరుకిరుకుగా ఉంటుంది. బయటికెళ్తే బోలెడంత ప్రపంచం. ఓ కవి అన్నట్టు

ఓ ఫూల్ సర్ చడా జో చమన్‌సే నిక్‌లా

ఉస్ షఖ్స్‌కు ఇజ్జత్ మిలీ జో వతన్‌సే నిక్లా

మనిషికైనా, మరే మహాత్ముడికైనా గడప దాటాకే బుద్ధి వికసించింది.

ఒంటరితనంతో బాధపడుతున్న వారికీ, డిప్రెషన్ లాంటి సమస్యలు వేధిస్తున్న వారికి సృష్టిరాసుల సేవకు మించిన చికిత్స లేదు అంటున్నారు మానసిక నిపుణులు. “ప్రజల్లో ఉత్తముడు ఎవరంటే, ఎవరి వల్లయితే ప్రజలకు ఎక్కువ మేలు కలుగుతుందో వారే” (ఇబ్ను హిబ్బాన్) అన్న ప్రవక్త (స) వారి మాటను మన బాటగా చేసుకొని అంత మంది కోసం పని చేస్తున్నప్పుడు ఒంటరి భావనకు చోటెక్కడిది చెప్పండి. మనిషి ఎదుర్కొనే మానసిక సమస్యలకు బంధాల్ని మించిన, స్నేహ పరామర్శలకు మించిన మందేముంటుంది చెప్పండి. పైగా సమయాన్ని సృష్టి సేవ కోసం కేటాయించేవారు, మిగతావారి కన్నా ఆరోగ్యంగా ఉంటారనీ, వారి ఆయుష్షు పెరుగుతుందనీ, వారి సంపాదనలో శుభం కలుగుతుందని ప్రవక్త (స) వారి పలు ప్రవచనాల ద్వారా రూఢీ అవుతుంది. నిజమే, మనకు బాగా ఇష్టమైన పని చేస్తున్నప్పుడు ఒత్తిడి ఉండదు. మనసు సేద తీరుతుంది. గుండె సాఫీగా పని చేస్తుంది. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది.

భరించలేని దిగులు ఆవరించినప్పుడు ప్రవక్త (స) గారి “యా బిలాల్ అరిహ్‌నా బిస్సలాత్” (ఓ బిలాల్! మాకు నమాజు ద్వారా విశ్రాంతి నివ్వు) అన్న మాటను అనుసరిస్తూ, తాగుడుకి ఇతర వ్యర్థ వ్యసనాలకి బానిస కాకుండా, మస్జిదుకు వెళ్ళటం, దైవ సన్నిధిలో సజ్దా చేయటాన్ని అలవాటు చేసుకోండి. మరీ బోరుగా ఉన్నప్పుడు సిగరెట్ తాగాలనిపించటం, చుట్ట పీల్చాలనిపించడం ఒక హానికర వ్యసనమైతే, మంచి స్వరం గల ఖుర్‌ఆన్ పారాయణాన్ని, పరలోక భీతిని పెంచే హితబోధ వినడం అలవాటు చేసుకోండి. ఎందుకంటే..? చెడ్డ వ్యసనం మనల్ని అధిగమించి ఎంతగా తన చెప్పుచేతలలో ఉంచుకొంటుందో, మంచి అలవాటు ఒక స్నేహితునిగా, మన పక్కన చేరి, మనతో పాటు ఉండి స్ఫూర్తినిస్తుంది.

అందుకే ఒక ప్రముఖ మేధావి ఇలా అన్నాడు:

(1) ఒక మంచి ఆలోచనకి అంకురం వెయ్యండి. ఒక స్ఫూర్తి మొలక పైకొస్తుంది.

(2) ఒక స్ఫూర్తి మొలకని అంటు కట్టండి. ఒక చర్య పుష్పిస్తుంది.

(3) చర్య అనే పుష్పాన్ని ఫలించనివ్వండి. అలవాటు అనే ఫలం పక్వానికొస్తుంది.

(4) ఆరాధన (అలవాటు) అనే ఫలాన్ని ఆస్వాదించండి. అది మీకు లక్ష్యం చేరుకొనే శక్తినిస్తుంది.

**చందాదారులకు విజ్ఞప్తి**

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

**వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి 9704317015**

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
Hyderabad- 500 002, Telangana

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**



# జడ్జిమెంట్ డే

- హుమేరా అమీర్,
ఏలూరు

**మనిషి** శ్వాసతో బ్రతికున్నంతకాలం తాను చేసుకున్న మంచి, చెడు కర్మలకు ఫలితాన్ని పొందే రోజు... ఎవ్వరికీ రవ్వంత కూడా అన్యాయం జరగకుండా, న్యాయం జరిగే దినం... భూలోకంలో విర్రవీగుతూ బ్రతికిన మహా మహా ఉద్దండపిండాలైనా గజగజ వణుకుతూ ఆ సర్వ సృష్టికర్త ముందు తల వంచుకుని నిలబడే ఘడియ... ఎవరూ ఎవరికీ ఏ విధమైన సహాయం అందించలేని ఒకే ఒక్క భయంకరమైన దినం... ప్రపంచములో అధికారమదంతో హద్దులు మీరి దౌర్జన్యాలు చేసిన ప్రతి పాలకుడు తమ తలను పైకెత్తి చూడడానికి కూడా సాహసించని రోజే... మహా తీర్పుదినం.

దైవదూత ఇస్రాఫీల్(అలైహి) శంఖం నోటి దగ్గర పెట్టుకుని, ఒక చేతిని తన చెవి మీద ఉంచి, కొంచెం ముందుకు వంగి, దైవ సింహాసనం వైపు చూస్తూ, శంఖం పూరించమని దైవం ఎప్పుడు ఆజ్ఞాపిస్తాడా? అని తీవ్రంగా నిరీక్షిస్తున్నారని ప్రవక్త ప్రవచనాలు మనకు తెలియజేస్తున్నాయి. శంఖం ఊదేందుకు దైవదూత ఇస్రాఫీల్ (అలైహి)కు దైవం అనుమతి ఇస్తే జరిగేది ఏమిటి?

మొదటిసారి శంఖారావం పూరించగానే ప్రజలు తీవ్రమైన భయాందోళనలకు గురి అవుతారు, కళ్ళు తేలేస్తారు, ఆ శంఖారావానికి చెవులు చిల్లులు పడిపోతాయి, గుండెలు దడదడలాడుతుంటాయి, ప్రతీ మనిషి తన భార్యాపిల్లలను, తల్లిదండ్రులను, రక్త సంబంధీకులను అందరినీ వదిలేసి పరుగులు పెడుతుంటాడు.

తర్వాత రెండవసారి శంఖారావం పూరించగానే భూమండల మంతా కుదిపేయబడుతుంది. ఆ భీకర ధ్వనికి యావత్తు జీవరాసులు చచ్చిపడిపోతాయి. ప్రచండ గాలులతో, తీవ్రమైన ప్రకంపనలతో, భూగోళమంతా అతలాకుతలం అవుతుంది. సముద్రంలో భయంకరమైన అగ్నిమంటలు పుడతాయి. సూర్య చంద్రులు గతి తప్పుతాయి. నక్షత్రాలు వాటికి నిర్ణయించిన కక్ష్య లను వదిలి బంతుల్లా గాలిలో తిరుగుతూ చివరికి అణు బాంబుల్లా పేలిపోతాయి. యావత్తు విశ్వమంతా అస్తవ్యస్తమవు తుంది. విశ్వవ్యవస్థ మారిపోయి, యావత్తు సృష్టిరాశులు తమ ఉనికిని కోల్పోతాయి, మిగిలి ఉండేది ఒక్క ఆ సర్వసృష్టికర్త మాత్రమే.

దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: “రెండవసారి శంఖారావం పూరించబడిన తర్వాత దైవం వర్షం కురిపిస్తాడు. దానివల్ల మానవులు నేల నుండి మొక్కల మాదిరిగా మొలకెత్తుతారు”.

మూడవసారి శంఖం పూరించగానే జడ్జిమెంట్ డే / తీర్పు దినం మొదలవుతుంది. దీన్నే ఖుర్ఆన్ భాషలో ‘యౌముల్ ఖియామ/ పునరుత్థాన దినం’ అంటారు. మూడవసారి శంఖం పూరించగానే

భూమి మీద పుట్టించబడిన మొట్టమొదటి మానవుడైన ఆదమ్ (అ) మొదలుకొని ప్రళయానికి ముందు చిట్టచివరిగా ఈ భూమి మీద పుట్టిన బిడ్డ వరకూ ప్రతి ఒక్కరూ పునర్జీవులై లేపబడతారు. మృత దేహాలను సమాధి చేసినా, సముద్రంలో కలిపేసినా, కాల్చి బూడిద చేసినా సరే అందరినీ దైవం తీర్పు దినం రోజున తిరిగి బ్రతికిస్తాడు. ఒకే ఒక్క ప్రళయ గర్జనతో ఒక్కొక్క సమాధి నుండి వేలాది మంది మానవులు లేచి ఒకరితో ఒకరు పోటీపడి హష్ర్ మైదానం వైపు పరుగెత్తుతారు. ఈ ప్రళయం మనం నివసించే భూమి మీదనే సంభవిస్తుంది, హష్ర్ మైదానం కోసం ఈ భూమి రూపురేఖలను మార్చడం జరుగుతుంది. కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, నదులు, సముద్రాలు మొదలైనవి ఏవీ లేకుండా ఒక చదునైన  మైదానంలా మారుతుంది.

హష్ర్ మైదానపు తీరుతెన్నుల గురించి మహా ప్రవక్త (స) ఎన్నో హదీసులు చెప్పడం జరిగింది: "ప్రళయదినాన ప్రజలందరినీ బూడిద వర్ణం గల తెల్లటి నేలపై ఓ చోట చేర్చడం జరుగుతుంది. అది మైదా పిండితో తయారైన రొట్టెలా ఉంటుంది.  అందులో ఎవరికీ ఏ గుర్తూ కానరాదు". (బుఖారీ, ముస్లిం - హజ్రత్ సహ్ల్ బిన్ సాద్ (రజి) ఉల్లేఖనం)

ఇహలోకంలో మనుషులు బ్రతికి ఉండగా వారి మార్గదర్శకత్వం కోసం ఎందరో ప్రవక్తలను పంపించిన అపార కారుణ్యమూర్తి, ఇహలోకంలో తప్పు చేసిన ప్రతీ మానవుడికి తన స్వీయ సంస్కరణ కోసం ఎన్నో కోట్ల  అవకాశాలను ఇచ్చే కారుణ్యప్రదాత, సర్వ లోకాల పాలకుడు, పోషకుడు, ఇహపర లోకాల శాంతిప్రదాత అయిన అల్లాహ్ ప్రళయదినం నాడు ఎంతటి క్రోధావేశంలో ఉంటాడు అంటే అది మనం మాటల్లో వర్ణించలేనిది. దైవప్రవక్త (స) తీర్పుదినం నాటి అల్లాహ్ క్రోధావేశం గురించి ఇలా ప్రవచించారు: "అల్లాహ్ ప్రళయదినాన భూమ్యాకాశాలన్నింటినీ చుట్టి తన కుడి చేతిలో ఒడిసిపట్టుకుని, పిల్లవాడు బంతిని తిప్పినట్లు తిప్పుతూ "నేను  ఏకైక దేవుడిని, నేనే రాజాధిరాజును, విశ్వ చక్రవర్తిని, నేనే సర్వ శక్తిమంతుణ్ణి, మహోన్నతుణ్ణి.  సృష్టిపై తమ సొంత ఇష్టాలను రుద్దిన ఆ క్రూరులైన పాలకులెక్కడా? నా భూమి మీద తమ బడాయి సింహాసనాల్ని వేసుకుని కూర్చునే ఆ నియంతలేరీ? ఆ అహంకారులు ఏమయ్యారు? అంటాడు".

మానవులు సమాధుల నుండి లేచిన తర్వాత వారి వారి కర్మలను బట్టి 3 వర్గాలుగా మారి హష్ర్ వైపు వెళ్లడం జరుగుతుంది. మొదటిది, కాలినడకన వెళ్లే వర్గం. రెండవది, వాహనాలపై వెళ్లే వర్గం. మూడవది, తలక్రిందులుగా ముఖంతో నడిచే వర్గం. ఈ మూడవ వర్గమే సత్య తిరస్కార వర్గం. ప్రపంచంలో ఉండగా వీరు సత్యం పట్ల అంధులుగా, బధిరులుగా ప్రవర్తించినందుకు దైవం వీరిని ప్రళయదినాన అంధులుగా, బాధితులుగా లేపుతాడు. ఇదే విషయాన్నీ ఖుర్ఆన్ ఇలా చెపుతోంది: "వారిని మేము ప్రళయదినాన బోర్లా పడేసి ఈడ్చుకొస్తాము. వారు అంధులు, బధిరులు, మూగలు.  నరకమే వారి నివాసమవుతుంది". (దివ్య ఖుర్ ఆన్ 17: 97)

సూర్యుడు మనకు కోట్లాది మైళ్ళ దూరంలో ఉన్నప్పటికీ మండు వేసవిలో సూర్యుడి తీవ్రతను భరించడం కష్టం. అటువంటి సూర్యుడి గురించి దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "ప్రళయదినాన సూర్యుడిని మానవులకు చాలా దగ్గరగా తీసుకురావడం జరుగుతుంది. వారు చేసుకున్న దుష్కర్మల్ని బట్టి కొందరికి తక్కువగా, మరికొందరికి ఎక్కువగా, కొందరికి చీలమండల వరకు, కొందరికి మోకాళ్ళ దాకా, కొందరికి నడుము వరకు  చెమట కారుతుంది. మరికొందరైతే పాదాలనుంచి నోటి దాకా చెమటతో మునిగిపోతారు. ఆ  చెమట కళ్లెంలా వారి నోళ్ళలోకి దూరి ఉంటుంది". (ముస్లిం, తిర్మిజీ)

ప్రళయదినం రోజు ఏ ఒక్క వ్యక్తినీ లెక్క తీసుకోకుండా వదిలి పెట్టడం జరగదు.  ప్రతి మనిషిని తన తల్లిదండ్రుల హక్కుల గురించి, భార్యాభర్తల హక్కుల గురించి, తన ఇంటివారి ధర్మ ఆచరణ గురించి, నైతికత గురించి, విద్యాబుద్ధుల గురించి, తన పొరుగువారి గురించి, చివరికి తను పెంచే పెంపుడు జంతువుల గురించి, ఇలా అనేక రకాలుగా ప్రశ్నించడం జరుగుతుంది. అంతేకాదు ప్రతి మనిషి దైవం తనకు ప్రసాదించిన జీవితం, సమయం, ఆస్తిపాస్తులు, సంపాదన, ఖర్చు, తన నోటి నుండి వచ్చే ప్రతీ మాట,  ప్రతి చేష్ట ఇలా మొత్తం తన జీవితం గురించి తీర్పుదినం రోజు దైవం ముందు, దైవ న్యాయస్థానంలో తన ఆచరణల చిట్టా చేత్తో పట్టుకుని ఆ సృష్టికర్త ముందు నిలబడి సమాధానం చెప్పవలసి ఉంటుంది.

దైవప్రవక్త(స) ఇలా ప్రవచించారు: "ప్రళయదినం నాడు ఈ 5 విషయాలను గురించి ప్రశ్నించబడకుండా, ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దేవుని న్యాయస్థానం నుండి ఏ ఒక్కరు ఒక్క అడుగును కూడా కదపలేరు.

1. తన యవ్వనాన్ని ఏ ఏ పనుల్లో గడిపాడు?
2. తనకు లభించిన ధార్మిక జ్ఞానాన్ని ఎంత వరకు అనుసరించాడు?
3. తన సంపదను ఏ  మార్గాల ద్వారా సంపాదించాడు?
4. తన సంపదను  ఏ మార్గాలలో ఖర్చు పెట్టాడు?
5. తన  యవ్వనాన్ని ఏ కార్యకలాపాల్లో కృశింపజేసాడు?



# హరిద్వార్‌లో విద్వేష ప్రసంగాలు

- ముహమ్మద్ యూసుఫ్ అస్కరీ

**మన** దేశ ప్రజల్లో అత్యధికులు శాంతి ప్రియులనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదనుకుంటాను. అంతేకాదు మన దేశ స్వాతంత్ర్యోద్యమం కూడా శాంతియుతంగా నడచి సఫలీకృతమ యిందన్న సంగతి కూడా జగమెరిగిన సత్యం. ఇందుకు గాను యావత్ ప్రపంచంలో మన దేశానికో ప్రత్యేకత ఉంది. మరో దిక్కు మన దేశంలో అప్పుడప్పుడు స్వార్థపర రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీలు తమ ఉనికిని చాటు కోవడానికో లేక ఇతరత్రా స్వార్థపర ప్రయోజనాల కోసమో మత ఘర్షణలు రేపడం కూడా నిరాకరించరాని నిజం. ఇవే మనకు భరించరానివిగా ఉన్నాయంటే కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం వచ్చిన నాటి నుండి హింస, అశాంతికి హద్దూపద్దూ లేకుండా పోయింది.

లోగడ మత ఘర్షణల్లో ఇరు వర్గాల ప్రజలు ఒకరిపై ఒకరు దాడి చేసుకొనేవారు, ఘర్షణ పడేవారు. కానీ ఇప్పుడు ఘర్షణ రూపురేఖలే మారిపోయాయి. ఇప్పుడు కేవలం హిందుత్వ మూకలు ఏదో ఒక కుంటిసాకుతో అల్పసంఖ్యాకులపై ఏకపక్షంగా దాడి చేసి పోలీసుల ఆధ్వర్యంలో హింస ప్రబలింపజేస్తున్నాయి.

జాతి వినాశనానికి ఇది సరిపోదన్నట్లు ఇప్పుడు ఏకంగా అల్ప సంఖ్యాకుల మారణహోమానికి బహిరంగంగా పిలుపునిచ్చే స్థాయికి ఈ మతోన్మాద మూకలు ఎదిగాయని చెప్పడానికి సభ్య సమాజం సిగ్గు పడుతోంది.

2021వ సంవత్సరం డిసెంబరు నెల 17 నుంచి 19 తేదీలలో యతి నరసింగానంద్ సర్వస్వతి ఆధ్వర్యంలో ఓ ధర్మ సంసద్ హరిద్వార్లో జరిగింది. ఇందులో పెద్ద ఎత్తున ప్రఖ్యాత సాధు, సంతువులు పాల్గొని ప్రముఖంగా క్రింద పేర్కొన్న మూడు అంశాలపై సుదీర్ఘ చర్చ జరిపారు.

ఈ సమావేశంలో పాల్గొన్న వారందరూ ఒకరిని మించి మరొకరు ద్వేషపూరిత భావాలను వ్యక్తపరచడం జరిగింది. ప్రముఖంగా ముస్లిం అల్పసంఖ్యాకుల మారణహోమానికి, వారిని నామరూపం లేకుండా చేయడానికి పిలుపునివ్వడమైనది.

యతి నరసింగానంద్ మాట్లాడుతూ, 2029లో ముస్లిం వ్యక్తి ప్రధానమంత్రి కాకుండా ఉండాలంటే, నేడు మనం ముస్లింలకు వ్యతిరేకంగా యుద్ధం చేయాల్సిన అవసరం ఉందని పిలుపు నిచ్చారు.

బీహార్‌కు చెందిన మరో సాధువు మహరాజ్ మాట్లాడుతూ, మాజీ ప్రధానమంత్రి డా. మన్మోహన్ సింగ్ పార్లమెంట్‌లో ముస్లింల పక్షాన మాట్లాడినప్పుడు, ఒకవేళ నేను అక్కడ ఉండి ఉన్నట్లయితే రివాల్వర్‌తో నాథురాం గాడ్సెలా ఆయనపై ఆరు గుండ్లు పేల్చే వాణ్ణి అని చెప్పడం జరిగింది.

మరికొందరు సాధువులు, క్రైస్తవులను క్రిస్మస్ ఉత్సవాలు హోటళ్ళలో, వాణిజ్య స్థలాల్లో జరుపుకోకుండా నివారించాలని, జిల్లా అధికారులను హెచ్చరించడం జరిగింది.

ఆనంద్ స్వరూప్ మహరాజ్ ఇంకో అడుగు ముందుకేసి ప్రజలు గాని, హొటళ్లు గాని క్రిస్మస్ ఉత్సవాలను జరుపుకుంటే వారికి వ్యతిరేకంగా 1857 లాంటి తిరుగుబాటు కంటే పెద్ద యుద్ధం చేస్తామని ప్రకటించడం జరిగింది.

మరో దశలో యతి నరసింగానంద్ మాట్లాడుతూ ఒక వేళ హిందూ యువకులు ఎల్‌టీటీఈ నాయకుడు ప్రభాకరన్ లాగా హిందూ ప్రభాకరన్ అవతారం ఎత్తినట్లయితే కోటి నుండి వంద కోట్ల దక్షిణ ఇవ్వడానికి తన సంసిద్ధత ప్రకటించడం జరిగింది. ఈయన ఒక దశలో సత్యమేవ జయతేకు బదులు శస్త్రమే జయతే అను నినాదం ఇవ్వడం జరిగింది.

స్వామి ప్రబోధానంద మాట్లాడుతూ, మయన్మార్ పౌరుల్లాగా హిందువులంతా ఆయుధాలెత్తాలని ముస్లింలను చంపనైనా చంపాలి లేక తానైనా చావాలని, ఇక మనకు మరో మార్గం లేదని చెప్పడం జరిగింది. ఇలా సాగింది ఆ సదస్సు. ఆ వివరాలన్నీ ఇక్కడ పొందుపరచడం కుదరదు.

మరో విషయం ఏమిటంటే, ఇలాంటిదే మరో సభ ఢిల్లీ మహా నగరంలో హిందూ వాహిని ఆధ్వర్యంలో 19 డిసెంబర్ 2021 నాడు జరిగింది. ఇందులో కూడా ముస్లింల సంహరణకు శపథం తీసుకోవడం జరిగింది. సుదర్శన్ టీవీ అధినేత సురేష్ చావాన్కి ఈ శపథాన్ని సభికులతో చేయించడం జరిగింది. ఈ రెండు సదస్సుల్లోని వారు ఎలాంటి తీవ్రవాద భావాలనయితే వ్యక్తపరిచారో వాటి వల్ల వారు కోరుకునేది దేశంలో అరాచకం తప్ప మరేమి కాగలదు. మరి ఇది దేశద్రోహం కాదా? వారిపై దేశద్రోహం కేసు పెట్టాలి కదా? వారు ఏ ధర్మాన్నైతే విశ్వసిస్తున్నారో అది సర్వధర్మ సంభావ్, వసుదేవ్ కుటుంబుకం అని ఉపదేశిస్తుంది. మరి వారు ఈ హైందవ మత సిద్ధాంతాలను ఆచరించనవసరం లేదా? ఆచరించనట్లయితే వారు హిందువులెలా అవుతారు?

అసలు విషయమేమిటంటే ఉత్తరప్రదేశ్, పంజాబ్‌ను కలుపుకొని ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు అతి త్వరలో జరగనున్నాయి. అక్కడ గెలిచే అవకాశాలు కానరావటం లేదు గనక ఈ గోలంతా చేయించాల్సి వచ్చింది. బీజేపీ ప్రభుత్వాలకు ఏదో ఒక వంకతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టి హిందూ ముస్లిమ్ మంటను చల్లారకుండా చేయడం, దీనిద్వారా హిందూ ఓట్లు చీలి పోకుండా చూడడం వాళ్ళ కనీస అవసరం. ఓటర్లకు చూపించడానికి వాళ్ళు సాధించినది ఏమీ లేదు గనక విభజించి పాలించడం ఒకటే వారికి గత్యంతరం.

బీజేపీకి ఇలాంటి కార్యక్రమాలు లిట్మస్ టెస్టుగా పనికొస్తాయి. కనుక అది తప్పనిసరిగా ఇలాంటి కార్యక్రమాలు తన తోటి సంస్థల ద్వారా చేయించి ప్రజల మనోగతాన్ని తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తూ ఉంటుంది. వాళ్ళ ల్యాబ్ టెక్నీషియన్లు ఎప్పటికప్పుడు ప్రజాస్పందన ఎలా ఉందనేది వారికి తెలియజేస్తూ ఉంటారు. దాన్నిబట్టి భవిష్య కార్యాచరణ తయారు చేయడం జరుగుద్ది.

హరిద్వార్ సదస్సులోని మూడు ప్రధానాంశాలలో ఒకటిదైన తొలి అంశం హిందూ ధర్మానికి రక్షణా రాహిత్యం. ముస్లింల వలన హిందూ ధర్మానికి అపాయం పొంచి ఉన్నట్లు చెప్పబడింది. నిజం చెప్పాలంటే ఇదో కుంటిసాకు. ముస్లింలపై హింస కొనసాగించడానికి తప్ప మరేమీ కాదు. దేశ జనాభాలో అతి కష్టంగా 14% ఉన్న ముస్లింలు, 85% ఉన్న హిందూ మతానికి ఏం కీడు చేయగలరు?.

అత్యధిక సంఖ్యలో MLA, MPలు హిందువులే, ముఖ్య మంత్రులూ హిందువులే. ప్రధానమంత్రి హిందువే, రాష్ట్రపతి హిందువే, ప్రధాన న్యాయమూర్తి హిందువే, పోలీసు శాఖా పతులు హిందువులే, ఆ మాటకొస్తే అన్ని సంస్థాధిపతులందరూ హిందువులే. మరలాంటప్పుడు హిందూ ధర్మానికి రక్షణ లేదనడం ఎంత వరకు సబబో ఆలోచించదగ్గ విషయం. నిజానికిది ఓ కుంటి సాకనే చెపాలి.

ఈ సదస్సు రెండో అంశమైన హిందూ రాష్ట్ర స్థాపన గురించి కూడా కొద్దిగా చర్చించాల్సి వుంటుంది. దీనికి కూడా ముస్లింలు అడ్డు అంటున్నారు. అదెలానో, దానికి తర్కం ఏమిటో బోధపడటం లేదు. అయినా దీని పరిష్కారం చట్టసభల్లో ఉంది. దీనికి ముస్లింలే కాదు, ముస్లిమేతరులు కూడా ఏం చేయలేరు. చట్టసభల్లో చర్చించి రాజ్యాంగాన్ని మార్చి హిందూ రాష్ట్ర స్థాపనకు మార్గం సుగమం చేసుకోవలసి ఉంటుంది. దీనికి ముస్లింలు అడ్డు అనడం ఓ కుంటి సాకు తప్ప మరేమీ కాదు.

పిచ్చి కాకుంటే నర సంహారం జరగడం ద్వారా హిందూ రాష్ట్ర స్థాపన జరుగుద్దా? కళింగ యుద్ధం చేసిన అశోకుడు జరిగిన హింసను చూసి పశ్చాత్తాపపడి ఇక ముందు నర వధ చేయనని ప్రతిజ్ఞ బూని బౌద్ధమతాన్ని స్వీకరించాడు. ఇది చరిత్ర చెప్పుతున్న వాస్తవం.

మారణహోమానికి పిలుపునివ్వడం మత రీత్యా, చట్ట రీత్యా నేరం. అంతర్జాతీయ స్థాయిలో కూడా దీన్ని ఖండించి తగు చర్య గైకొనడం జరుగుతుందని సదస్సు నిర్వాహకులు గమనించాలి. దుష్ట పాలకులు చూసీ చూడనట్లు నటించినా, సుప్రీంకోర్టు ఊరుకోదు. సుమోటో ప్రాతిపదికన చర్య తీసుకోవలసి ఉంటుంది.

అన్నింటికి మించి సదస్సు నిర్వాహకులు తెలుసుకోవలసిందేంటంటే, ఏ జాతీ మరో జాతిని నామరూపాల్లేకుండా చేయజాలదు. దీనికి గాను నేటికి జరిగిన 46 మారణహోమాలు, రెండు ప్రపంచ యుద్ధాలు సజీవ సాక్ష్యాలు. మొదటి ప్రపంచ యుద్ధం నాలుగేళ్లు, రెండవ ప్రపంచ యుద్ధం ఆరేళ్లు అనగా ఇలా పది సంవత్సరాలు యుద్ధాలు జరిగినా ఏ జాతీ నామరూపాల్లేకుండా పోలేదు. జర్మనీయులు హోలోకాస్ట్ ద్వారా 60 లక్షల యూదులను చంపినా యూదు జాతి నేటికీ సజీవంగా ఉండటమేగాక, ప్రపంచానికి సవాలుగా మారింది. వీళ్ళను చంపిన హిట్లర్ ఆత్మహత్య చేసుకొని చచ్చాడని గుర్తుంచుకోవాలి.

యతి నరసింగానంద్ హిందూ యువకులకు ఎల్‌టీటీఈ నాయకుడయిన ప్రభాకరన్‌ను మోడల్‌గా తీసుకొని హిందూ ప్రభాకరన్ లా తయారు కావాలని కోరారు. మరి ప్రభాకరన్ తన లక్ష్యంలో సఫలీకృతం కాలేకపోయాడు. అతను దాదాపు ముప్పయి ఏళ్ళు అక్కడి సింహళి ప్రభుత్వానికి ఎదురు తిరిగి గృహ యుద్ధం చేశాడు. మరి ఇక్కడి యువకులను ఇలా గృహ యుద్ధంకు పురిగొలపడం దేశద్రోహం కాదా! మరి ఆయనపై దేశద్రోహం కేసు ఎందుకు పెట్టరాదు?

ముగింపు పలుకుతూ చెప్పదలచుకున్నది ఏమిటంటే ఇది ధర్మాన్ని రక్షించడానికి చేస్తున్న యుద్ధం కానే కాదు, మనుస్మృతి ప్రాతిపదికన హిందుత్వ రాష్ట్ర స్థాపనకు జరుపుతున్న యుద్ధం.


ఇకపోతే ఇప్పుడు ముస్లింలు ఏం చేయాలి? అనేదే ముఖ్యమైన ప్రశ్న. పరిస్థితుల గాంభీర్యాన్ని చూచి భయపడకూడదు. భయాన్ని అస్సలు దరిచేరనివ్వరాదు. ఇది మన ప్రవక్తల సంప్రదాయం. ఇబ్రాహీం (అలైహి) ఒక్కరే అయినప్పటికి నమ్రూద్‌ను ఎదిరించారు, అలాగే మూసా(అ) తన అన్నతో సహా కేవలం ఇద్దరే అయినప్పటికీ ఫిరౌనుకు ఎదురు తిరిగారు. కావలసింది సంఖ్యాబలం కాదు దైవ విశ్వాస బలం.

ఐకమత్యంతో బహు జాగరూకతతో మెలగాలి. ముస్లిమేతర సోదరులతో పెద్ద ఎత్తున సత్సంబంధాలను పెంచుకోవాలి. సర్వమత సమ్మేళనాలు ఏర్పాటు చేసి సోదరభావాన్ని పెంపొందించాలి. వీటన్నింటికి మించి మనం, మారణ హోమానికి పిలుపునిచ్చిన సాధూ సంత్‌లకు ఇస్లాం శిక్షణ ఏంటో అత్యుత్తమ రీతిలో తెలియజేయాలి. ఇస్లాం జీవన విధానంలో మనిషి ప్రాణానికున్న విలువ ఏంటో వాళ్ళకు తెలియ జేయాలి. అందరూ దైవదాసులే, అలాగే అందరూ ఆదమ్(అస) సంతతే అన్న సంగతి వాళ్ళకు తెలియజేయాలి. కనుక ఇస్లాంలో తరతమ భేదాల్లేవని తెలియజేయాలి. సర్వమానవులు అల్లాహ్ పరిజనులే అన్న విషయం వారికి తెలియజేయాలి.

## మానవ హక్కుల పరిరక్షణ ప్రస్తుత కాలంలో సవాలుగా మారింది




మానవ హక్కుల రక్షణ ప్రస్తుత కాలంలో సవాలుగా మారింది. ఈ కాలంలో మానవ వర్గానికి ఉన్నన్ని అపాయాలను గతంలో ఊహించి ఉండరని డాక్టర్ ఎమ్ఏ మజీద్ అన్నారు. హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మానవ హక్కుల విషయంలో ప్రమాదాలు పొంచి ఉన్నాయి అన్నారు. గత కొన్ని సంవత్సరాలలో దేశంలో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనల సంఘటనలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. మన దేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైనప్పటికీ దేశం విభిన్న వివక్షలు ఎదుర్కోవడం శోచనీయం అన్నారు. మానవ హక్కుల ఉల్లంఘనలను అడ్డుకునేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. జమాఅతె ఇస్లామీ హింద్ మానవ హక్కుల అంశంపై పలు ప్రాంతాలలో కార్యక్రమాలు నిర్వహించింది. వీటిలో మానవ హక్కుల ఉల్లంఘనలు అడ్డుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ, ప్రజలను జాగృతపరచడానికి ప్రయత్నిస్తోంది. డిసెంబర్ 10 అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్, కరీంనగర్, కొత్తగూడెం, మహబూబ్‌నగర్‌లలో మానవ హక్కుల రక్షణపై సదస్సులు, సమావేశాలు, సింపోజియంలు జరిగాయి.




# బడుగుల జీవితాల్లో వెలుగులు నింపిన విద్యా జ్యోతి
# పూలే దంపతులకు ఆశ్రయమిచ్చిన స్నేహశీలి.... ఫాతిమా షేక్

**పూర్వకాలంలో** విద్య సామాన్యులకు అందని ద్రాక్షగా ఉండేది. కేవలం అగ్రకులాల వాళ్ళు మాత్రమే విద్యాభ్యాసం చేయడానికి అర్హులుగా పరిగణించబడేవారు. మిగతా వారెవరూ చదువుకు అర్హులు కారు. శూద్రులు, దళితులు, మహిళలు విద్య నేర్చుకోవడం నేరం, పాపం. సనాతన మత సాంప్రదాయంలో శూద్రులెవరైనా వేదం విన్నా, ఉచ్చరించినా మరణ శిక్షకు అర్హులు. వేదం విన్నవారి చెవుల్లో సీసం కరిగించి పోయడం, చదివిన వారి నాలుకలు తెగ్గోయడం పరిపాటి. అలాంటి ఉన్మాద, అజ్ఞానకాలంలో విద్యావ్యాప్తి కోసం అనేక మంది సంస్కర్తలు కృషిచేశారు. విద్యను సర్వసామాన్యం చెయ్యడానికి అలుపెరుగని ప్రయత్నం చేశారు. అగ్రవర్ణ సమాజం నుండి ఎన్ని అవమానాలు, ఎన్ని బెదిరింపులు, ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో సమాజ సంస్కరణ కోసం పాటుపడ్డారు. అలాంటి వారిలో ఫాతిమా షేక్ ఒకరు. ఈమె సావిత్రీబాయి స్నేహితురాలు, సహోద్యోగి. భర్త సహకారంతో సావిత్రీబాయి, సోదరుని సహకారంతో ఫాతిమా విద్యార్జన చేశారు. సావిత్రిబాయితో కలిసి జ్యోతీరావు పూలే దగ్గరే ఆమె చదువు నేర్చుకున్నారు. సోదరుడు ఉస్మాన్ షేక్ ప్రోత్సాహంతో ఉన్నత చదువులూ అభ్యసించారు. సోదరుని సహకారంతోనే విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేశారు. పూలే దంపతులు గృహ బహిష్కరణకు గురైనప్పుడు వారికి ఆశ్రయం కల్పించి ఆదుకున్నారు. తమ హవేలీనే పాఠశాల నిర్వహణ కోసం పూలే దంపతులకు వితరణగా ఇచ్చి అండగా నిలిచారు. సావిత్రీబాయి పూలేతో కలిసి ఉపాధ్యాయురాలిగా విద్యా వ్యాప్తిలో కీలక పాత్ర పోషించారు. దళితుల ఇళ్ళకు వెళ్ళి పిల్లల చదువు విషయంలో వారిని చైతన్య పరిచారు. గంటల

**మిగతా 34వ పేజీలో...**

దళితుల, మహిళల ఆశల నిధి
అంబుల పొది
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

# గృహిణి బాధ్యతలు ఇంతింత కాదయా...



- తస్నీమ్ జహాన్ ఖాన్

నిద్ర లేచిన దగ్గరినుండి పడుకునేవరకు ఇంటి పనులు, బయటి పనులు, సమయం సందర్భం అనే పట్టింపు లేకుండా వచ్చిపడే పనులతో తలమునకలై ఉండే మీకు ఒక గంట ఖాళీ లభిస్తే దాన్ని మీరెలా ఉపయోగించుకుంటారు? ఈ ప్రశ్న ప్రతీ ఇల్లాలినీ అడగాలని అనుకుంటున్నాము.

నేటి ఆధునిక యుగంలో స్త్రీ ఇంటా బయటా అన్నిచోట్ల ఎంతో కష్టపడుతుంది. ఆమె గృహిణి అయినా, ఉద్యోగి అయినా నిరంతరం బరువు బాధ్యతలను నిర్వర్తిస్తూ తన గురించి తాను పట్టించుకునే సమయం, తీరిక లేక ఒక యంత్రం వలే పనిచేస్తూనే ఉంటుంది. తన ఇంటి వారి కోసం శారీరక శ్రమతో తోడ్పడుతుంది. ఆర్థికంగాను కుటుంబాన్ని ఆదుకుంటుంది. చాలా మందికి తమ కోసమంటూ కొంత సమయం లేకుండా పోతుంది. ఉద్యోగినుల జీవితమైతే మరీ మర మనుషుల వలె తయారై పోయింది. నిద్ర లేచిన దగ్గరి నుండి వంట పని, పిల్లల పని, ఇంటిని శుభ్రపరచటం, బట్టలుతకడం, తాను స్వయంగా ఆఫీసుకై సిద్ధమవడం, హడావిడిగా ఉద్యోగ స్థానానికి చేరుకోవడం, ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించడం, ఇంటికి తిరిగి వచ్చిన దగ్గరి నుండి పడుకునే వరకు మళ్ళీ పనులే పనులు. నిరంతరం మరలాగా పని చేస్తూనే ఉండటం వల్ల ఎంతో ఒత్తిడికి లోను కావడం జరుగుతుంది. ఒక్కోసారి ఒత్తిడి మరీ ఎక్కువైపోయి మైగ్రేన్, డిప్రెషన్ వంటి రోగాలు చుట్టుముడతాయి. కొందరిలో అధిక రక్తపోటు, చక్కెర వ్యాధి తక్కువ వయసులోనే దరిచేరే ప్రమాదముంటుంది. గృహిణుల పరిస్థితి కూడా అలాగే ఉంటుంది. నిరంతరం ఏదో ఒక పని వచ్చిపడుతూనే ఉంటుంది. కొంత సమయం విశ్రాంతి తీసుకుంటే ఆకాశం బ్రద్దలై మీద పడినట్లు అత్తగారి హంగామా మొదలవుతుంది. ఇది చేయలేదు, అది చేయలేదు అంటూ గొణుకుడు మొదలవుతుంది.

మహిళల జీవితం ఎలా ఉంటుందంటే, వారి వద్ద అందరి కోసం సమయం ఉంటుంది కాని తమ కోసం తాము తీరిక చేసుకోలేరు. తమలోని టాలెంట్‌ని గుర్తించి, మెరుగుపరుచుకోవడానికి తమలోని లోపాలను సవరించుకోవడానికి, తమను తాము స్వీయ పరిశీలన జరుపుకోవటానికి సమయం ఉండదు. అందువల్ల వారి టాలెంట్ వృధా అవుతుంది. వారి లోపాలు అలాగే కొనసాగుతూ ఉంటాయి. తమ వ్యక్తిత్వాన్ని ఉన్నత పరుచుకోవాలనుకునే ప్రతి మహిళ కూడా తమ కోసం ఒక గంట అయినా కేటాయించుకోవాలి. తనలోని మంచి విషయాలను పెంచుకుంటూ, తనలోని బలహీనతలను వదిలించుకునే ప్రయత్నం చేస్తూ ఉండాలి.

## ఆరాధనలో లీనమవడం

మనం ఎంతలా బిజీ అయిపోయామంటే, మన అసలు జీవిత లక్ష్యం ఏమిటో కూడా మనం మరిచిపోయాము. ఉదయం నుండి రాత్రి వరకూ పనులు పనులు పనులు... తీరికే లేదు. నమాజ్, రోజాను విడిచిపెట్టడం ఆషామాషీ వ్యవహారంగా భావిస్తున్నాము. మన పనులే మన జీవిత లక్ష్యం అనుకుని వాటి కోసమే జీవితాన్ని అంకితం చేస్తున్నాము. మనల్ని ఎందుకు సృష్టించాడో అల్లాహ్ స్పష్టంగా ఇలా తెలియజేస్తున్నాడు : ''నేను జిన్నాతులనూ, మానవులనూ నా ఆరాధన కొరకు తప్ప మరి దేని కొరకూ సృష్టించలేదు.'' (51: 56)

ఇతరులకు సౌలభ్యాలు అందించేందుకు మీరు మీ ఆరాధనలను విడిచిపెట్టి మరీ శ్రమించాల్సిన అవసరం లేదు. మీరు ఆరాధనలను విడిచిపెడ్తే ఆ దోషం మీపైనే ఉంటుంది. ఇతరులెవ్వరూ ఆ పాపాన్ని తమపై మోపుకోరు. సమయానికి నమాజ్, రోజాలు నిర్వర్తించండి. ఖాళీ దొరికినప్పుడల్లా దైవనామస్మరణ చేస్తూ ఉండండి. దేవుని దృష్టిలో మీ స్థానాన్ని ఉన్నతపరచుకోండి.

## జ్ఞానార్జన

జ్ఞానార్జనతో మనిషి విలువ పెరుగుతుంది. విజ్ఞానిని సమాజం ఎల్లవేళలా ప్రశంసిస్తుంది. ఎప్పుడో చిన్నప్పుడు ఏదో చదువుకున్నాము, ఇక చదువుకునే అవసరం ఏముందిలే అని జ్ఞానార్జనను మహిళలు చిన్నచూపు చూస్తున్నారు. ఆధునిక పరిజ్ఞానాన్ని, ధార్మిక పరిజ్ఞానాన్ని ఎల్లప్పుడూ మనం పెంపొందించుకుంటూనే ఉండాలి. దానికై మంచి పుస్తకాలు ఖాళీ సమయాల్లో చదువుతూ ఉండాలి. వారపత్రికల్లో స్పెషల్ కథనాలు, ఆర్టికల్స్, సోషల్ మీడియాలో విజ్ఞానవంతమైన పోస్టులు, వీడియోలు అన్నింటినీ అధ్యయనం చేస్తూ ఉండాలి.

అన్ని రంగాలను గురించి తెలుసుకునే ప్రయత్నం చెయ్యాలి. దేశ విదేశాల వార్తలు, సైంటిఫిక్ రిసెర్చ్‌లు, పోషకాహారం, ఆరోగ్య సూత్రాలు, వ్యాధుల గురించి అవగాహన, ఖుర్ఆన్, హదీసుల అవగాహన అన్నింటినీ మనం తెలుసుకోవాలి. మనకెందుకులే అని నిర్లక్ష్యంగా ఉంటే మీ మాటకు విలువ ఉండదు. మిమ్మల్ని అందరూ పక్కన బెట్టేస్తారు. ఏమీ తెలియని దద్దమ్మ, మూర్ఖురాలు అని ముఖం మీదే అనేస్తారు. మీరు ఎంత పెద్ద పోస్టులో ఉన్నా సరైన జ్ఞానం, అవగాహన లేకుండా ఉంటే మీకు విలువ ఉండదు.

## బంధాలు, బంధుత్వాలకు సమయం కేటాయించాలి

మీరు ఎంత బిజీగా ఉన్నా మీ తల్లిదండ్రుల కోసం సమయం తీసి రోజూ వారితో మాట్లాడే ప్రయత్నం చెయ్యాలి. బంధువులు, తోబుట్టువుల కోసం కొంత సమయం కేటాయించి వారిని పలకరిస్తూ ఉండాలి. వారి ఇళ్ళకు వెళ్ళి కనిపిస్తూ ఉండాలి. లేకపోతే వారినే మీ ఇంటికి పిలిపించుకుని ముచ్చటించాలి. ఫోన్లు చేసుకుంటూ ఉండాలి. పంతాలు, పట్టింపులు, అలకలు, కక్షలను విడనాడి హాయిగా మనసు విప్పి మాట్లాడుకుంటే మనసు తేలిక పడుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. మీరు ఎంత గొప్ప హోదాలో ఉన్నా, మీ భర్త ఎంత పెద్ద ఆఫీసరైనా తల్లిదండ్రులకు బిడ్డగా ఉంటారు. తోబుట్టువులకు తోబుట్టువులే, బంధువులకు బంధువుగానే ఉంటారు. అందరితో నగుమోముతో కలుపుగోలుతనంగా ఉంటేనే మీకు దైవం దృష్టిలో మంచి విలువ ఉంటుంది. హోదా అంతస్తులను చూసుకుని విర్రవీగి బంధుత్వాలను తెంచుకునేవారిని అల్లాహ్ ఇష్టపడడు.

## విశ్రాంతి

బిజీ లైఫ్ స్టైల్‌లో మహిళలు గృహిణులైనా గానీ, ఉద్యోగినులు అయినా గాని నిద్రలేమికి గురవుతున్నారు. బాధ్యతలు, పనులు ఎక్కువై నిద్ర పూర్తికాకుండానే మేల్కోవలసి వస్తుంది. దీని ప్రభావం నేరుగా ఆరోగ్యంపై పడుతుంది. నిద్రలేమి వల్ల మానసికంగా ఎక్కువ సమస్యలు తలెత్తుతాయి. కన్ఫ్యూజన్, కాన్సెంట్రేషన్ దెబ్బతినడం, అసహనం, తలనొప్పి, చిరాకు ఎక్కువ అవుతాయి. ఖాళీ సమయాల్లో కొంతసేపు నిద్ర పోవడం వల్ల ఈ సమస్యలకు చెక్ పెట్టవచ్చు.

## ఆరోగ్యం

కుటుంబంలో అందరి బాగోగులను కనిపెట్టుకుని ఉండే ఇల్లాలు తన సొంత ఆరోగ్యం విషయంలో మాత్రం చాలా అశ్రద్ధగా ఉంటుంది. టైమ్‌కి భోజనం చేయకపోవడం, అనారోగ్య చిహ్నాలను నిర్లక్ష్యం చేయటం, హెల్త్ బాగోలేకపోయినా పనిచేస్తూ ఉండటం, సమయానికి మందులు వేసుకోకపోవడం ప్రతీ భారతీయ మహిళకు అలవాటే. కానీ, ఆరోగ్యం గురించి శ్రద్ధ వహించటం అవసరం. సమయానికి తింటూ, మందులు వేసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

## ఇతరులకు సహాయపడటం

కేవలం మన గురించి మనం లీనమైపోయి ఇరుగు పొరుగు వారిని నిర్లక్ష్యం చేయకూడదు. సమాజంలో బలహీనులను వారి మానాన వారిని విడిచిపెట్టకూడదు. మాట సహాయం గానీ, డబ్బు సహాయం గానీ, శ్రమ ద్వారా సహాయపడటం గానీ ఏది అవసరమనుకుంటే అది మీరు చేయగల్గినంత సహాయం తప్పక చెయ్యాలి. ఇతరులకు సహాయపడి వారి దీవెనలను, దుఆలను పొందాలి. మంచి సలహాలను ఇచ్చి శ్రేయోభిలాషిలా ఇతరుల మంచిని కోరుకుంటే మీ జీవితం కూడా మంచిగానే ఉంటుంది. మంచి పనులలో సహకరించాలి. చెడుల్లో లీనమై ఉన్నవారిని వాటి దుష్ప్రభావాలను వివరించి ఆ చెడుల్లోనుంచి బయటకు తీసుకుని రావాలి. దీనిని గురించి అల్లాహ్ మనల్ని ఆదేశిస్తున్నాడు: "విశ్వసించిన పురుషులు, విశ్వసించిన స్త్రీలు పరస్పరం సహకరించుకుంటారు. వారు మంచిని ఆదేశిస్తారు, చెడును నిరోధిస్తారు." (అత్ తౌబా : 71)

రోజువారి బిజీ షెడ్యూల్లో మీ కోసం మీరు కొంత సమయాన్ని మిగుల్చుకుని ఇన్ని పనులు చేయవచ్చు. దీంతో మీ ఆరోగ్యం, మీ బంధాలు, మీ పుణ్యాలు, మీ పరలోక జీవితం అన్నీ మీకు శుభకరమైనవిగా మారుతాయి. ఇవి మేము సూచించిన కొన్ని సూచనలు మాత్రమే. రోజుకో గంట ఖాళీ సమయం దొరక బుచ్చుకుని మీరు ఎలా దాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారో తప్పక మీ సన్నిహితులతో ఆ అనుభవాన్ని పంచుకోండి. వారినీ ఇన్‌స్పైర్ చెయ్యండి.




## హరిద్వార్ మత విద్వేష ప్రసంగంపై ప్రముఖుల ఆందోళన

హరిద్వార్‌లో ఇటీవల జరిగిన మత విద్వేష ప్రసంగాలపై 270 మందికి పైగా ప్రముఖులు, సంస్థలు ఆందోళన వ్యక్తం చేశారు. నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వీరిలో నేవల్ స్టాఫ్ మాజీ చీఫ్ అడ్మినర్ ఎల్.రామ్‌దాస్, రాష్ట్రీయ సేవాదళ్ అధ్యక్షులు డాక్టర్ గణేష్ దేవి, మాజీ ఐఎఎస్, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ వ్యవస్థాపకులు అరుణ్ రారు, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎపి షా, మాజీ ఐపిఎస్, పంజాబ్ గవర్నర్ మాజీ సలహాదారు జూలియో రిబైరో, న్యాయవాది బెలా భాటియా, ఉద్యమవేత్త బన్వార్ మేఘవాన్షి, జెఎన్‌యు ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ తదితరులు ఉన్నారు.

## ఆ ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధం

దేశవ్యాప్తంగా పాఠశాలల్లో సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై ముస్లిమ్ సంస్థలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆల్ ఇండియా ముస్లిమ్ పర్సనల్ లా బోర్డు తీవ్రంగా వ్యతిరేకించింది. బోర్డు ప్రధాన కార్యదర్శి మౌలానా ఖాలిద్ సైపుల్లా రహ్మానీ విడుదల చేసిన ప్రకటనలో, భారత దేశం లౌకికవాద దేశమని, ఇక్కడ మెజారిటీ మతస్థుల ఆచారాలు, సంప్రదాయాలను ఇతర మతాలపై రుద్దకూడదని చెప్పారు. ముస్లిం విద్యార్థులు ఈ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అన్నారు. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు జారీ చేసిన ఈ ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. ప్రతి ఒక్కరికీ తమ మతాచారాలకు అనుగుణంగా ప్రార్థన చేసుకునే స్వేచ్ఛను రాజ్యాంగం కల్పించిందని తెలిపారు. రాజ్యాంగ లౌకికవాద విలువలను గౌరవిస్తూ, ఈ ఆదేశాలను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశం పట్ల నిజంగా ప్రేమ చూపించాలని ప్రభుత్వం అనుకుంటే, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు.

## జన గణన, ఎన్‌పీఆర్ నిరవధిక వాయిదా

కోవిడ్-19 మహమ్మారి కారణంగా 2021 జనాభా లెక్కల సేకరణ తొలి విడత నిరవధికంగా వాయిదా పడింది. దీంతోపాటు, జాతీయ జనాభా రిజిష్టర్ (ఎన్‌పీఆర్) తాజాపరిచే ప్రక్రియను ఇప్పుడున్న పరిస్థితి బట్టి చేపట్టే అవకాశం లేదని అధికార వర్గాలు తెలిపాయి. పౌరసత్వ నమోదు చట్ట సవరణ (సీఏఏ)తో ఎన్‌పీఆర్‌ను ముడిపెట్టడాన్ని వామపక్షాలతో సహా ప్రతిపక్షాలు తీవ్రంగా నిరసించాయి. ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా బీజేపీ, ఆరెస్సెస్‌ల ఫాసిస్టు ఎజెండాలో భాగమే ఇది అన్నది స్పష్టం. బీజేపీ ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా దేశ వ్యాపితంగా నిరసనలు, ఆందోళనలు పెద్దయెత్తున చోటు చేసుకున్నాయి. అయినా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దీనిపై మొండిగా ముందుకెళ్లాలని చూస్తున్నది.

## యాప్ కేసులో ముగ్గురి అరెస్ట్

ముస్లిం మహిళలను లక్ష్యంగా చేసుకుని రూపొందించిన బుల్లీ బాయ్ యాప్ కేసులో ముంబయి సైబర్ పోలీసులు ఐదుగురిని గుర్తించినట్లు ముంబయి పోలీస్ కమిషనర్ హేమంత్ నాగ్రాలే తెలిపారు. వీరిలో ముగుర్ని అరెస్టు చేశామని, మొత్తం ఐదుగుర్ని విచారణ చేయడంతోపాటు, వీరి ఆన్‌లైన్ చర్యల్ని ట్రాక్ చేశామని పేర్కొన్నారు. ఈ యాప్‌ను నిర్వహిస్తున్న వారిని, ట్విట్టర్ ఖాతాలను నిర్వహిస్తున్న వారిని పోలీసులు గుర్తించినట్లు వెల్లడించారు. ఇప్పటి వరకూ పట్టుబడని నిందితులు ఆన్‌లైన్‌లో, ఇంటర్నెట్‌లో సాక్ష్యాలను నాశనం చేసే అవకాశం ఉన్నందున కేసు వివరాల్ని పోలీసులు వెల్లడించడం లేదని నాగ్రాలే చెప్పారు. నిందితుల అసలు లక్ష్యం ముస్లిం మహిళలను అవమానించడం, భయ పెట్టడం అని తెలిపారు.

## ఇతర రాష్ట్రాలు కూడా జార్ఖండ్ మాదిరిగా మూక హింసకు వ్యతిరేకంగా చట్టాలు చేయాలి

దేశంలో మైనారిటీలు, దళితుల పట్ల విద్వేషం అనునిత్యం పెరుగుతోంది. కొన్ని విద్రోహ శక్తులు పట్టపగలు మూక హింసకు పాల్పడుతున్నాయి. ఆ దృశ్యాలను చిత్రీకరించి మరీ సోషల్ మీడియాలో పెడుతున్నాయి. వాటిని అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని జమాఅతె ఇస్లామీ హింద్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సలీమ్ ఇంజనీర్ అన్నారు. తరచూ ముస్లిములకు వ్యతిరేకంగా విద్వేష ప్రసంగాలు జరుగుతున్నాయి. బహిరంగంగా ఇస్లామోఫోబియా వ్యాఖ్యలు చేసి వారిని లక్ష్యంగా చేసుకుంటు న్నారు. వారి ఆరాధనాలయాలపై దాడులు చేస్తున్నారు. ఏదైనా రాష్ట్రంలో ఎన్నికలున్నాయంటే విద్వేషాలు విరజిమ్మే వ్యాఖ్యలు ఆనవాయితీగా మారుతున్నాయి. జార్ఖండ్ ప్రభుత్వం మూక హింసకు వ్యతిరేకంగా బిల్లు చేసి మంచి నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా రాజస్థాన్, పశ్చిమబెంగాల్, మణిపూర్ కూడా దీని గురించి ఆలోచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా జార్ఖండ్ మాదిరిగా మూకదాడులకు వ్యతిరేకంగా చట్టం చేయాలని ఆయన కోరారు.

## సూడాన్ ప్రధాని రాజీనామా

సూడాన్‌లో రాజకీయ సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు సూడాన్ ప్రధాని అబ్దుల్లా హమ్దోక్ ప్రకటించారు. సైన్యంతో కుదిరిన రాజకీయ ఒప్పందంలో భాగంగా ఆయనను ఆ పదవిలో తిరిగి నియమించిన రెండు నెలలకే ఈ రాజీనామా వార్త వెలువడింది. ప్రజాస్వామ్య క్రమానికి సూడాన్ మారాలంటే కొత్త ఒప్పందం అవసరమని, అందుకు గానూ రౌండ్ టేబుల్ చర్చలు జరగాలని అబ్దుల్లా అన్నారు. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు సమగ్రంగా చర్చలు జరపడం అవశ్యమని ఆయన స్పష్టం చేశారు. దేశ ప్రజలనుద్దేశించి ఆయన టీవీలో మాట్లాడారు. సైనిక కుట్రను వ్యతిరేకిస్తూ దేశంలో నిరంతరాయంగా ప్రదర్శనలు జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది.

## అణు పోటీ వద్దు

అణు యుద్ధాన్ని నివారించి, ఆయుధ పోటీని విడనాడేందుకు చర్యలు తీసుకోవాలని, వాటిని దృఢ నిశ్చయంతో అమలు చేయాలని ఐదు అణ్వాయుధ దేశాలైన చైనా, ఫ్రాన్స్, రష్యా, బ్రిటన్, అమెరికా నేతలు నిర్ణయించారు. దీనిపై వారు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. అణ్వాయుధ దేశాల మధ్య యుద్ధాన్ని నివారించడం, వ్యూహాత్మక ముప్పులను తగ్గించుకోవడం అత్యంత ప్రాధాన్యత గల బాధ్యతలుగా వుండాలని నేతలు భావించారు. అణుయుద్ధంలో ఎన్నడూ విజయం సాధించలేమని, అందువల్ల ఎన్నడూ అణ్వాయుధాలతో పోరాడరాదని వారు ఆ ప్రకటనలో పునరుద్ఘాటించారు. అణ్వాయుధాలు వున్నంత వరకు అవి రక్షణ ప్రయోజనాలకే ఉపయోగపడాలని అన్నారు. దురాక్రమణను అడ్డగించేందుకు, యుద్ధాన్ని నివారించేందుకు ఉపయోగపడాలన్నారు. ఇటువంటి ఆయుధాలు మరింతగా వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని ఐదు దేశాల నేతలు గట్టిగా అభిప్రాయపడ్డారు.

## కజకిస్తాన్‌లో ఇంధన ధరల పెంపుపై ప్రజాగ్రహం

ఇంధన ధరల పెంపుపై కజకిస్తాన్‌లో ప్రజాగ్రహం వెల్లువెత్తింది. ఆయిల్, మెటల్ రంగాలను విదేశీ పెట్టుబడిదారుల పరమైనప్పటి నుంచి అక్కడ ఇంధన ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజాగ్రహం పెల్లుబుకడంతో ప్రభుత్వం రాజీనామా చేసింది. కజకిస్తాన్‌లో అతి పెద్ద నగరమైన అల్మాటీతో సహా పలు నగరాలు నిరసనలతో అట్టుడికి పోయాయి.




## ఇస్రాయిల్ దురాక్రమణలను అంతమొందించడానికి కొత్త రాజకీయ మార్గాలు అన్వేషించాలి

ఇస్రాయిల్ ఆక్రమణలను అంతమొందించడానికి కొత్త రాజకీయ మార్గాలను అన్వేషించాలని ఫలస్తీనా అధ్యక్షుడు మహ్మూద్ అబ్బాస్ పేర్కొన్నారు. ఫలస్తీనీయులు ఎల్లప్పుడూ ఆక్రమణకు గురికావడానికి సిద్ధంగా లేరు. అంతర్జాతీయ ప్రమాణాల ద్వారా ఆక్రమణలను స్వస్తి పలకాలన్నారు.

## మద్యాన్ని పారబోసిన తాలిబన్‌లు

సుమారు మూడు వేల లీటర్ల మద్యాన్ని తాలిబాన్‌లు కాబూల్ కెనాల్‌లో పారబోసినట్లు ఆఫ్ఘన్ నిఘా సంస్థ తెలిపింది. దేశంలో మద్యం అమ్మకాలను అరికట్టడంలో భాగంగా తాలిబాన్‌లు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. దీనికి సంబంధించి జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ ఇంటెలిజన్స్ (జిడిఐ) ఒక వీడియో ఫుటేజీని విడుదల చేసింది. మద్యం బ్యారెల్లలో నిల్వ చేసిన డ్రమ్ములను స్వాధీనం చేసుకున్న అనంతరం కాల్వలో పారబోస్తున్న దృశ్యాలు ఆ వీడియోలో కనిపిస్తున్నాయి. మద్యం తయారీ, సరఫరాని ముస్లింలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఏజన్సీ ట్వీట్ చేసింది.

## యుద్ధాల కోసం 20 ఏళ్ళలో 14 లక్షల కోట్లు ఖర్చు పెట్టిన అమెరికా

రెండు దశాబ్దాలుగా ఆఫ్ఘనిస్తాన్, మధ్య ప్రాచ్యంలో సాగించిన యుద్ధంలో అమెరికా మిలటరీ 14లక్షల కోట్ల డాలర్లను ఖర్చు పెట్టింది. ఈ యుద్ధం వల్ల ఆయుధాల తయారీదారులు, డీలర్లు, కాంట్రాక్టర్లు లబ్ది పొంది సుసంపన్నులయ్యారు. ఈ మేరకు వాల్ స్ట్రీట్ జర్నల్‌లో సవివరమైన నివేదిక వచ్చింది. బ్రౌన్ యూనివర్శిటీకి చెందిన కాస్ట్స్ ఆఫ్ వార్ ప్రాజెక్ట్, ఏరియా స్కాలర్లు, న్యాయ నిపుణులు, ఇతరుల నుంచి ఈ వార్తా పత్రిక డేటాను సేకరించింది. అమెరికా జరిపిన యుద్ధాల వల్ల కనిపించని ప్రభావంపై వీరందరూ పనిచేస్తున్నారు. ఈ యుద్ధాల కారణంగా అతి బీదరికం నుంచి సుసంపన్నులైన వారి కొన్ని కథనాలను కూడా ఈ నివేదిక ఇచ్చింది. పలు రంగాల వారు దాదాపు 400 కోట్ల డాలర్ల విలువ చేసే కాంట్రాక్టులను పొందారు. యుద్ధరంగ కాంట్రాక్టర్లపై ఆధారపడడం వల్ల యుద్ధ వ్యయం ఏ రకంగా పలు రెట్లు పెరిగిందో నిర్ధారించేందుకు బైడెన్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. వృథా అయిన మొత్తాలు, అవినీతి వ్యవహారాలపై వందలాది నివేదికలను సిగార్ (ఆఫ్ఘన్ పునర్నిర్మాణంపై అమెరికా స్పెషల్ ఇన్‌స్పెక్టర్ జనరల్) సేకరించింది.

**29వ పేజీ తరువాయి...**

సమయం వెచ్చించి వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు విద్య ఆవశ్యకతను వివరించి వారిలో జ్ఞాన జ్యోతులు వెలిగించారు. ఆ రోజుల్లో సనాతన మనువాదులు మహిళా విద్యను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించేవారు. రకరకాలుగా వేధించేవారు. అవమానాలకు, ఛీత్కారింపులకు గురి చేసేవారు. బెదిరింపులకు పాల్పడేవారు. అయినా ఆమె ఏ మాత్రం లక్ష్య పెట్టలేదు, లెక్క చేయలేదు. దుమ్మెత్తి పోసినా, పేడ నీళ్ళు కుమ్మరించినా, రాళ్ళువిసిరినా చలించలేదు. ఈనాడు హరిజన, గిరిజన, మైనారిటీ, బడుగు బలహీన వర్గాల ప్రజలంతా విద్యాపరంగా ముందడుగు వేస్తున్నారంటే, అది ఫాతిమా షేక్, ఉస్మాన్ షేక్, సావిత్రిబాయి, జ్యోతిరావు పూలేల వంటి సంస్కర్తల పుణ్యమే అని గ్రహించాలి. సోదరుడు ఉస్మాన్ షేక్ సహకారంతో సావిత్రిపూలే, జ్యోతిబా పూలేలతో కలసి ఫాతిమా విద్యావ్యాప్తితో పాటు, అనేక సేవా కార్యకలాపాల్లో పాల్గొన్నారు.

ఫాతిమా జననానికి సంబంధించి నిర్దిష్టమైన సమాచారం లభ్యం కానప్పటికీ ఆమె 1825-27 జనవరి 9వ తేదీన జన్మించినట్లు ఎక్కువ మంది చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. ఫాతిమా షేక్ గురించి సావిత్రీబాయి పూలే ఇలా రాశారు: 'ఫాతిమా నాకు ఎంతగానో సహకరించారు. ఆమె సహకారంతోనే నేను అనేక సేవా కార్యక్రమాలను కొనసాగించగలిగాను' అంటూ ఆమె తన భర్త జ్యోతిబా పూలేకు రాసిన లేఖలలో పేర్కొన్నారు. ఫాతిమా షేక్ సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టినంతగా సాహిత్యంపై పెట్టలేదు. లేకపోతే ఆమె గొప్ప సాహిత్యాన్ని సృజించి ఉండేవారని, ఆమెకు సంబంధించిన సమాచారం లభించడంలో అది ఎంతగానో ఉపయోగపడేదని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

2014లో మహారాష్ట్ర ప్రభుత్వం సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్, జాకిర్ హుస్సేన్, అబుల్ కలాం ఆజాద్ లాంటి వారితో పాటు ఫాతిమా షేక్ సంక్షిప్త పరిచయాన్ని 'బాల్ భారతి'లో పాఠ్యాంశంగా చేర్చింది. ఫాతిమా కేవలం ముస్లిం సమాజం కోసమే పని చేయలేదు, సమాజంలో వివక్షకు, అన్యాయానికి, అణచివేతకు, అవిద్యకు గురైన అన్ని వర్గాల ప్రజల కోసమూ ఆమె పాటు పడ్డారు. అగ్రకులాధిపత్యంలో తీవ్ర వివక్షకు గురైన వితంతువుల్లో చైతన్యం తీసుకురావడానికీ ఆమె శక్తివంచన లేని ప్రయత్నం చేశారు. ఎలాంటి అసమానతలూ లేని సమ సమాజాన్ని ఆమె కాంక్షించారు. దేవుని దృష్టిలో అందరూ సమానమే అయినప్పుడు మానవుల మధ్యనే ఈ వివక్ష ఎందుకన్నది ఆమె ప్రశ్న. ఇంతటి స్ఫూర్తి ప్రదాత అయిన ఫాతిమా షేక్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, ఆమె చేపట్టిన సేవా కార్యక్రమాలు, విద్యా వ్యాప్తి కోసం ఆమె చేసిన అసామాన్య కృషిని చరిత్రకారులు వెలికి తీసి, వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే, షుమారు 180 సంవత్సరాల క్రితం నాటి అజ్ఞాన సమాజంలో, నాటి ప్రతిబంధకాలన్నిటినీ ఛేదించుకొని సమాజ సంస్కరణ కోసం నడుంబిగించడం, లక్ష్యాన్ని ముద్దాడడం సామాన్య విషయం కాదు. కనుక సావిత్రిబాయి పూలేతో పాటు, ఫాతిమా షేక్‌నూ స్మరించుకోవలసిన అవసరం ఉంది. విపత్కర పరిస్థితుల్లో పూలే దంపతులకు ఆశ్రయం కల్పించి, తమ హవేలీని పాఠశాల నిర్వహణ కోసం వితరణగా ఇచ్చి, వారితో భుజం భుజం కలిపి పనిచేసిన ఫాతిమా షేక్ కృషినీ గుర్తించి, సావిత్రిబాయితో సమానంగా గౌరవిస్తూ, పీడిత, తాడిత అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆమె చేసిన త్యాగాలను స్మరించుకోవలసిన అవసరం ఉంది. ఫాతిమా, సావిత్రి స్ఫూర్తితో బహుజనులంతా కలిసి హక్కుల కోసం సమిష్టి పోరాటాలు చేయవలసిన అవసరమూ ఉంది..

**తు ది గీ టు**




Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2020-2022 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**